సాక్షి అనంతపురం

శనివారం । 22 । జూలై । 2023



చీనీ టన్ను రూ.19 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.19 వేలు పలికాయి. మార్కెట్‌కు 601 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో @ రూ.107

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.107 పలికింది. కనిష్టం రూ.55, సరాసరి రూ.96 చొప్పున క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
31.9°/21.8°

జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా మోస్తరు నుంచి తేలికపాటి వర్షపాతం నమోదైంది. నైరుతి దిశగా గాలులు గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

29 మండలాల్లో తేలికపాటి వర్షం



అనంతపురం అగ్రికల్చర్: జిల్లా అంతటా తేలికపాటి వర్షాలు కొనసాగుతున్నాయి. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు 29 మండలాల పరిధిలో 8.2 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. విడపనకల్లు 16.6 మి.మీ, రాప్తాడు 16.2, నార్పల 14.6, పెద్దవడుగూరు 14.2, యాడికి 14, బుక్కరాయసముద్రం 13.2, పుట్లూరు 11.6, కుందుర్పి 10.6, కణేకల్లు 10 మి.మీ తోపాటు వజ్రకరూరు, కళ్యాణదుర్గం, బొమ్మనహాళ్, శింగనమల, గుంతకల్లు, గార్లదిన్నె, అనంతపురం, డి.హీరేహాళ్, యల్లనూరు తదితర మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. బెళుగుప్ప, శెట్టూరు మినహా మిగతా అన్ని మండలాల్లో తేలికపాటి వర్షపాతం నమోదైంది. జూలై నెల సాధారణ వర్షపాతం 63.9 మి.మీ కాగా నైరుతి రుతుపవనాలు ప్రభావం చూపకపోవడం, గాలివేగం పెరగడంతో ఇప్పటి వరకు 38 మి.మీ వర్షపాతం నమోదైంది. గత జూన్ 1 నుంచి ఇప్పటి వరకు 13 వర్షపు రోజులు నమోదయ్యాయి. నాలుగైదు రోజులుగా తేలికపాటి వర్షాలు పడటంతో ఖరీఫ్ ఏరువాక బాగా పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. కాగా రాగల రెండు రోజులు జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.అశోక్‌కుమార్ శుక్రవారం విడుదల చేసిన వాతావరణ బులెటిన్‌లో పేర్కొన్నారు.

సమస్యలకు తక్షణ పరిష్కారం

- అధికారులకు ఇన్‌చార్జ్ జేసీ గాయత్రీదేవి ఆదేశం




అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌చార్జ్ జేసీ గాయత్రీదేవి, హౌసింగ్ పీడీ కేశవనాయుడు

అనంతపురం అర్బన్: ఉద్యోగుల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపించాలని ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ గాయత్రీదేవి జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన 'ప్రత్యేక స్పందన'లో ఇన్‌చార్జ్ జేసీతో పాటు హౌసింగ్ పీడీ కేశవనాయుడు, పరిపాలనాధికారి శ్రీధర్ ఉద్యోగుల నుంచి వివిధ సమస్యలపై 80 అర్జీలు స్వీకరించారు. అనంతరం ఇన్‌చార్జ్ జేసీ మాట్లాడుతూ ఉద్యోగులు ప్రభుత్వ పరిధిలోని పాలసీ అంశాలపై కాకుండా సర్వీస్ అంశాలపై సమస్యలు ఉంటే అర్జీల ద్వారా తమ దృష్టికి తేవాలన్నారు.

వినతులు కొన్ని...

- తనను ధర్మవరం డిపోకు బదిలీ చేయాలని గుంతకల్లు డిపో ఆర్టీసీ డ్రైవర్ సత్యమయ్య విన్నవించాడు.
- ఎంఆర్‌సీలుగా (మండల రిసోర్స్ కో–ఆర్డినేటర్) నియామకాలు చేపట్టాలని సాక్షర భారత్ మిషన్ ఎంఆర్‌సీలు విశ్వేశ్వర, గంగాధర్ తదితరులు అర్జీ సమర్పించారు. తమను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఫేజ్–2 కింద ఆర్‌డబ్ల్యూఎస్ ఎంఆర్‌సీలుగా నియమించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని చెప్పారు. ఇందుకు సంబంధించి ఫైలు కలెక్టరేట్‌కు వచ్చిందని, పరిశీలించి త్వరగా నియామక ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి



అనంతపురం రూరల్: సివిల్ సర్వీసెస్, గ్రూప్–1, గ్రూప్–2 పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ మధుసూదన్‌రావు ఓ ప్రకటనలో కోరారు. విశాఖపట్నంలో సివిల్ సర్వీసెస్, విజయవాడలో గ్రూప్–1, తిరుపతిలో గ్రూప్–2కు శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. కుటుంబ వార్షికాదాయం రూ.6 లక్షల లోపు ఉండడంతో పాటు ఏపీకి చెందిన వారు శిక్షణకు అర్హులని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు https://apstdc.apcfss.inలో ఆగస్టు 5లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

చేనేతకు సర్కారు చేయూత

- 'వైఎస్సార్ నేతన్న నేస్తం' కింద రూ.21.96 కోట్ల సొమ్ము విడుదల
- జిల్లాలో 9,150 మంది చేనేత కార్మికులకు లబ్ధి
- ప్రతి శనివారం ఉద్యోగులు చేనేత వస్త్రాలు ధరించాలి
- త్వరలో సర్క్యులర్ జారీ చేస్తామన్న కలెక్టర్ గౌతమి



'వైఎస్సార్ నేతన్న నేస్తం' మెగా చెక్కు విడుదల చేస్తున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో వివిధ సంస్థల చైర్‌పర్సన్లు మంజుల, హరిత, నదీం అహ్మద్, లిఖిత, రామలక్ష్మి

అనంతపురం: చేనేత కార్మికులు తమ కాళ్ల మీద తాము నిలబడేలా రాష్ట్ర ప్రభుత్వం 'వైఎస్సార్ నేతన్న నేస్తం' పథకం ద్వారా చేయూతనందిస్తోందని కలెక్టర్ ఎం.గౌతమి అన్నారు. 'వైఎస్సార్ నేతన్న నేస్తం' కింద ఒక్కో చేనేత కార్మికునికి ఏడాదికి రూ.24వేల ఆర్థికసాయం బ్యాంకు ఖాతాలకు జమ చేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం తిరుపతి జిల్లా వెంకటగిరి బహిరంగ సభ నుంచి కంప్యూటర్ బటన్ నొక్కి లాంఛనంగా ప్రారంభించారు. జిల్లాస్థాయి కార్యక్రమం అనంతపురంలోని కృష్ణ కళామందిరం రెవెన్యూ కళ్యాణమండపంలో చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. చేనేత కార్మికులు తమ సొంత మగ్గాలను ఆధునికీకరించుకునేందుకు, మరమగ్గాల పోటీ తట్టుకొని చేనేత మార్కెట్‌ను పెంపొందించుకుని జీవన ప్రమాణాలు మెరుగుపరుచుకునేందుకు 'వైఎస్సార్ నేతన్న నేస్తం' పథకం ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకం కింద ఐదో ఏడాదికి గాను జిల్లాలోని 9,150 మంది చేనేత కార్మికులకు రూ.21.96 కోట్లు మంజూరైందన్నారు. ఈ మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాలకు జమ చేస్తున్నట్లు చెప్పారు. ఈ ఆర్థికసాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో చేనేత రంగం బాగా విస్తరించిందని, నేతన్నలు సంప్రదాయ వృత్తిని కొనసాగించడం ఎంతో సంతోషం కలిగిస్తోందని అన్నారు. ప్రతి శనివారం జిల్లా అధికారులు, ఉద్యోగులు చేనేత దుస్తులు ధరించే విధంగా ప్రత్యేక సర్క్యులర్ జారీ చేయనున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. సాంకేతిక నిపుణుల ఆలోచనలకనుగుణంగా చేనేత వస్త్రాలు ఎంతో నాణ్యతగా తయారవుతున్నాయన్నారు.

జగన్ పాలనలో సంక్షేమ కాంతులు

జగన్ పాలనలో అన్ని వర్గాల్లో సంక్షేమ కాంతులు వెల్లివిరుస్తున్నాయని రాష్ట్ర నాటక అకాడమీ చైర్‌పర్సన్ హరిత అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహ్మద్ మాట్లాడుతూ చేనేతకార్మికులకు 'వైఎస్సార్ నేతన్న నేస్తం' ఆపన్నహస్తంగా మారిందన్నారు. గత ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని విస్మరించాయని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ తదితర అన్ని వర్గాల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తోందన్నారు. ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల మాట్లాడుతూ చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలకు 'నేతన్న నేస్తం' ఎంతో ఊతమిస్తోందన్నారు. ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత మాట్లాడుతూ జగన్ సర్కారు కులమత రాజకీయాలకు అతీతంగా అమ్మ ఒడి మొదలుకొని వైఎస్సార్ నేతన్న నేస్తం వరకు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి మాట్లాడుతూ వైఎస్సార్ నేతన్న నేస్తం చేనేత కుటుంబాల్లో వెలుగులు నింపుతోందన్నారు. చివరగా నేతన్న నేస్తం మెగా చెక్కును కలెక్టర్ చేతుల మీదుగా విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా చేనేత జౌళి శాఖ అధికారి శ్రీరంగం అప్పాజీ, ఉరవకొండ ఎంపీపీ చందా చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

అన్నలా ఆదుకున్నారు



పేద కుటుంబాల్లోని చెల్లెమ్మలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నలా ఆదుకుంటున్నారు. నేతకార్మికుల కష్టాలను గుర్తించి నేతన్న నేస్తం కింద రూ .24 వేల ఆర్థికసాయాన్ని ఖాతాల్లో జమ చేయడం ఎంతో ఆనందంగా ఉంది. మాలాంటి నిరుపేదలను ఆదుకుంటున్న సీఎంకు మేమంతా అండగా ఉంటాం.

– పల్లవి, ఉరవకొండ

నేతన్న కన్నీళ్లు తుడిచారు



మా కుటుంబానికి మగ్గమే ఆధారం. కరోనా వేళ జీవనం కష్టమైంది. అటువంటి సమయంలో మాలాంటి నిరుపేదలకు సీఎం జగమోహన్‌రెడ్డి అన్ని విధాలా సహాయం చేశారు. ప్రస్తుతం మార్కెటింగ్ చేసుకునే స్థాయికి తీసుకొచ్చి.. మా కన్నీళ్లు తుడిచిన గొప్ప నాయకుడు జగన్. ఆయన మేలును ఎన్నటికీ మరువం.

– నారాయణ స్వామి, పెనకచెర్ల, గార్లదిన్నె

కేన్సర్‌కు అధునాతన చికిత్స



సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావుతో మాట్లాడుతున్న సీసీసీ రాష్ట్ర బృందం సభ్యులు

- కాంప్రెహెన్సివ్ కేన్సర్ కేర్ యూనిట్‌కు కసరత్తు

అనంతపురం క్రైం: జిల్లాలో కేన్సర్ రోగులకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో చికిత్స అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే కాంప్రెహెన్సివ్ కేన్సర్ కేర్ (సీసీసీ) యూనిట్ ఏర్పాటుకు కసరత్తు మొదలు పెట్టింది. డీఎంఈ ఆదేశాలతో సీసీసీ రాష్ట్ర నోడల్ అధికారులు ఆర్ రమేష్ బాబు, డాక్టర్ దుర్గాప్రసాద్, నాట్కో సలహాదారులు అశోక్, ఇంజినీర్లు దేవరాజ్ భవారియా, అజీష్ నాయర్, సమీర్ సాల్కోనే బృందం శుక్రవారం జేఎన్‌టీయూ సమీపంలోనే కేన్సర్ కేర్ యూనిట్, పరిసర ప్రాంతాలను పరిశీలించింది. అందుబాటులో ఉన్న స్థలాల్లో ఏయే యూనిట్లు, బంకర్లు, తదితర పరికరాల ఏర్పాటు చేయాలన్న విషయమై సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, ఏపీఎంఎస్‌ఐడీసీ ఈఈ మహబూబ్‌తో చర్చించారు. త్వరలో వీటికి ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించనున్నట్లు నోడల్ అధికారులు తెలిపారు. సూపరింటెండెంట్ మాట్లాడుతూ ప్రస్తుతం కేన్సర్ యూనిట్‌లో కీమోథెరపీ సేవలు అందుబాటులో ఉన్నాయని, సీసీసీ ద్వారా మెడికల్, సర్జికల్, రేడియేషన్ అంకాలజీ సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. రేడియోథెరపీ హెచ్‌ఓడీ సతీష్‌కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ ప్రశాంతి, అసిస్టెంట్ ప్రొఫెసర్ దినకర్, ఏపీఎంఎస్‌ఐడీసీ డీఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈ రామాంజనేయులు, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ సౌజన్య కుమార్ పాల్గొన్నారు.

నేతన్నలకు సీఎం వైఎస్ జగన్ అండ



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, చిత్రంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య తదితరులు

బెళుగుప్ప: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'నేతన్న నేస్తం' పథకం ద్వారా చేనేత కార్మికులకు అండగా నిలుస్తున్నారని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్యతో కలిసి ఆయన బెళుగుప్ప మండలం అంకంపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ రైతు, చేనేత కార్మికుల సంక్షేమానికి ముఖ్యమంత్రి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారన్నారు. భైరవానితిప్ప ప్రాజెక్టుకు ఇటీవల రూ.208 కోట్లకు గాను తొలి విడతగా రూ.165 కోట్ల నిధులు విడుదల చేశారన్నారు. ఈ నిధులతో కాలువ తవ్వకం పనులు ఊపందుకుంటాయని, భూములు కోల్పోయిన రైతుల ఖాతాలకు పరిహారం జమ చేస్తున్నారని తెలిపారు. బీటీపీ కాలువ నిర్మాణం పూర్తయితే గంగవరం, హనిమిరెడ్డిపల్లి, కోనాపురం చెరువులకు నీరు నిండి తద్వారా వేలాదిమంది రైతులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. ఇప్పటికే దుద్దేకుంట, గంగవరం, కోనంపల్లి తదితర గ్రామాల రైతులకు ఎకరాకు రూ.11 లక్షల నుంచి రూ.14 లక్షల దాకా పరిహారం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. నేతన్న నేస్తం పథకం కింద చేనేత కార్మికులకు ఏటా అందిస్తున్న రూ.24వేల సాయం ఎంతో ఉపయోగపడుతోందన్నారు.

సామాజిక న్యాయం జగన్‌తోనే సాధ్యం..

సీఎం జగన్ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల అభ్యున్నతికి కృషి చేస్తూ ఎమ్మెల్సీ, రాజ్యసభ స్థానాల్లో అధిక ప్రాధాన్యత ఇచ్చి సామాజిక న్యాయం పాటించారని పైలా నరసింహయ్య ప్రశంసించారు. టీడీపీకి ఎన్నికల సమయంలో మాత్రమే బీసీలు గుర్తుకు వస్తుంటారని విమర్శించారు. ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ చుట్టపుచూపుగా గ్రామాలకు వచ్చి వెళ్తున్నారని ఎద్దేవా చేశారు. దొంగ ఓట్లు, దౌర్జన్యాల ద్వారా ఎన్నికల్లో గెలుపొందుతుంటారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి నియోజకవర్గమంతటా కలియదిరుగుతూ ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చొరవ చూపుతున్నారని కొనియాడారు.

బాబు డైరెక్షన్‌లోనే బీసీ అధికారిపై ఫిర్యాదు

హరీష్‌యాదవ్ మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు డైరెక్షన్‌లో దత్త పుత్రుడు జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా విధులు నిర్వర్తించిన బీసీ మహిళా పోలీసు అధికారిపై టీడీపీ సూచనల మేరకే పవన్ కళ్యాణ్ ఫిర్యాదు చేశారన్నారు. కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, ఎంపీపీ పెద్దన్న, బీసీ అధ్యయన కమిటీ సభ్యులు ధనుంజయ యాదవ్, సర్పంచ్ రుద్రానంద, ఎంపీటీసీ ప్రభావతి, వైఎస్సార్‌సీపీ బీసీసెల్ అధ్యక్షుడు సీపీ వీరన్న, మండల నాయకులు త్రిలోక్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచాలి

- జిల్లాస్థాయి వ్యవసాయ సలహా మండలిలో నిర్ణయం
- ఆగస్టులో రాయితీ విత్తనాల పంపిణీ



మాట్లాడుతున్న అగ్రిబోర్డు జిల్లా చైర్మన్ టి.రాజశేఖర్‌రెడ్డి, వేదికపై డీఆర్వో గాయత్రీదేవి, డీఏఓ ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అగ్రికల్చర్: ఈ ఏడాదిని 'అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం'గా ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోనూ చిరుధాన్యపు పంటల సాగును ప్రోత్సహించాలని జిల్లాస్థాయి వ్యవసాయ సలహామండలి నిర్ణయించింది. శుక్రవారం రెవెన్యూభవన్‌లో జరిగిన జిల్లాస్థాయి వ్యవసాయ సలహామండలి సమావేశానికి జిల్లా చైర్మన్ టి.రాజశేఖర్‌రెడ్డి, డీఆర్వో గాయత్రీదేవి, డీఏఓ ఉమామహేశ్వరమ్మ తదితరులతో పాటు పలువురు అధికారులు, బోర్డు సభ్యులైన రైతులు హాజరై పలు అంశాల చర్చించారు. ప్రధానంగా వర్షాభావంతో సాగు విస్తీర్ణం తగ్గినందున చిరుధాన్యపు పంటల విస్తీర్ణం పెంచడానికి అవకాశం ఏర్పడిందన్నారు. ఆగస్టు ఐదో తేదీ తర్వాత ప్రత్యామ్నాయ విత్తన ప్రణాళిక, పంటల సాగును అమలు చేస్తామని డీఏఓ తెలిపారు. ఖరీఫ్ విస్తీర్ణాన్ని బట్టి ప్రాంతాల వారీగా రైతులకు అవసరమైన కొర్రలు, రాగులు, పెసలు, అలసంద, జొన్న వంటి చిరుధాన్యపు ప్రత్యామ్నాయ విత్తనాలు రాయితీతో పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆర్‌బీకేల్లో విత్తనాలు, ఎరువులు, ఇతరత్రా అగ్రి ఇన్‌పుట్స్ రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలని రైతులు కోరారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల నాణ్యత విషయంలో తరచూ దుకాణాల్లో తనిఖీలు కొనసాగించాలని సూచించారు. కౌలుదారులను గుర్తించి సీసీఆర్‌సీ కార్డులు ఇచ్చి ప్రభుత్వ ఫలాలు అందిస్తామని అధికారులు తెలిపారు. వ్యవసాయానికి, పల్లెలకు విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయమూ ఏర్పడకుండా అక్కడక్కడా కట్‌పాయింట్‌లు పెట్టాలని చైర్మన్ సూచించారు. ఐఎఫ్ఎస్‌సీ కోడ్ సమస్య వల్ల 57 మంది రైతులకు ఇన్‌పుట్‌సబ్సిడీ జమ కాలేదని గుర్తు చేస్తూ... దీనిపై అధికారులు, బ్యాంకర్లు వెంటనే చర్యలు తీసుకోవాలని చైర్మన్ కోరారు.

మళ్లీ బడికి రండి!

- సర్కారు విప్లవాత్మక నిర్ణయం
- ఫెయిల్ అయిన విద్యార్థులూ విద్యాలయాల్లో చేరేలా చర్యలు
- వారికీ 'అమ్మఒడి' వర్తింపు
- వలంటీర్ల సహకారంతో విద్యార్థుల గుర్తింపు
- జిల్లాలో ఇప్పటికే 746 మంది విద్యార్థుల చేరిక

రాష్ట్ర ప్రభుత్వం 100 శాతం స్థూల నమోదు నిష్పత్తి (జీఈఆర్) సాధనకు నడుం బిగించింది. ఇందులో భాగంగా నాణ్యమైన మధ్యాహ్న భోజన పథకం, అమ్మఒడి, జగనన్న విద్యా కానుక, మనబడి నాడు–నేడు లాంటి విప్లవాత్మక పథకాలు అమలు చేస్తోంది. ఈ క్రమంలోనే పదో తరగతి, ఇంటర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులు మళ్లీ చదువుకోవటానికి అవకాశం కల్పించింది. సర్కారు నిర్ణయాన్ని విద్యా, సామాజికవేత్తలు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆహ్వానిస్తున్నారు.



ఇంటర్ ఫెయిల్ అయిన బాలికలను అనంతపురం కేఎస్ఆర్ బాలికల జూనియర్ కళాశాలలో చేర్పిస్తున్న డీవీఈఓ వెంకటరమణనాయక్

రాప్తాడురూరల్: ఫెయిల్ అయిన బాలబాలికలు ఆత్మన్యూనతా భావంతో కుంగిపోవటం, ఏదో ఒక పనిలో సంపాదనకు అలవాటు పడి వ్యసనాలకు బానిసవుతున్నారు. భవిష్యత్తును శూన్యంగా మార్చుకుంటున్నారు. ఇలా అర్ధంతరంగా విద్యార్థులు చదువులకు దూరం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. పదో తరగతి, ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు మళ్లీ బడికి, జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు కల్పించేందుకు ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. 2022 మార్చి, సప్లిమెంటరీ పరీక్షల్లో ఫెయిల్ అయిన, 2023 మార్చి, సప్లిమెంటరీ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులను గుర్తిస్తూ వారిని స్కూళ్లు, జూనియర్ కళాశాలల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే జిల్లాలో 746 మంది పది, ఇంటర్ విద్యార్థులకు ప్రవేశాలు కల్పించారు. పదో తరగతిలో 507 మంది, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 190, ద్వితీయ సంవత్సరంలో 49 మందిని చేర్పించారు. ఆగస్టు 7 నాటికి ఫెయిల్ అయిన విద్యార్థులందరినీ గుర్తించేలా ప్రభుత్వం గడువు విధించింది. 2023 మార్చి, సప్లిమెంటరీ పరీక్షల్లో ఫెయిలై స్కూళ్లు, కళాశాలల్లో చేరుతున్న విద్యార్థులందరికీ జగనన్న విద్యా కానుక కిట్లు, అమ్మఒడి పథకాలను అమలు చేయనున్నారు.


వలంటీర్లు కీలకం..

ఫెయిల్ అయిన విద్యార్థులను గుర్తించడంలో వలంటీర్ల వ్యవస్థ కీలకంగా పని చేయనుంది. విద్యార్థుల వివరాలు నమోదు చేసేందుకు వలంటీర్లకు ప్రత్యేకంగా స్టూడెంట్ ఇన్‌ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఎస్ఐఎంఎస్) 'యాప్' రూపొందించారు. వలంటీర్ల పరిధిలోని నివాసాల్లో ఉండే పిల్లల వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. యాప్ యూడైస్ పోర్టల్‌కు అనుసంధానం చేసి ఉంటుంది.

పంచాయతీరాజ్ శాఖ సహకారం కరవు..

ఎంఈఓలు, హెచ్ఎంలు, సీఆర్టీలు, వార్డు, గ్రామ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ సెక్రటరీలు, వలంటీర్లు సమన్వయంతో ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టాలని ఉన్నతాధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో విద్యాశాఖకు పంచాయతీరాజ్ శాఖ అధికారుల సహకారం అంతంతమాత్రంగానే ఉంటోంది. ఎలాంటి ఉత్తర్వులు లేకపోవడంతో ఎడ్యుకేషన్ వెల్ఫేర్ సెక్రటరీలకు గట్టిగా చెప్పలేకపోతున్నామని కొందరు ఎంఈఓలు వాపోతున్నారు. ఉన్నతాధికారులు చొరవ చూపాలని కోరుతున్నారు.

విప్లవాత్మక నిర్ణయం



సామాజిక వేత్తలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యావంతులు, ప్రభుత్వ రంగ సంస్థలు, తల్లిదండ్రులు సామాజిక స్పృహ కలిగి బడిఈడు పిల్లలందరూ బడిలో ఉండేలా చూడాలి. ప్రభుత్వం కూడా అందుబాటులో పాఠశాలలు, తగిన సంఖ్యలో ఉపాధ్యాయులు, చక్కని మధ్యాహ్న భోజనం, చదువులు భారం కాకూడదనే అమ్మఒడి, ఆకర్షణీయంగా పాఠశాలలు, బాలికలకు కేజీబీవీలు ఇంకా విద్యా దీవెన, వసతి దీవెన లాంటి పథకాలతో ప్రోత్సహిస్తోంది. పది, ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులకు పునః ప్రవేశాలు కల్పించటమనేది ఓ విప్లవాత్మక నిర్ణయం. – ఎం.సాయిరామ్ డీఈఓ

ఓటు సరిచూసుకోండి

- బీఎల్ఓల ఇంటింటి సర్వే ప్రారంభం



రిజిష్టర్లు, దరఖాస్తులు తీసుకెళుతున్న సిబ్బంది

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికలు మరో తొమ్మిది నెలల్లో జగనున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ప్రస్తుతం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ–2024 కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పూర్తి చేసి 2024 జనవరి 5వ తేదీన తుది ఓటరు జాబితాను ఎన్నికల కమిషన్ ప్రకటించనుంది. ఎన్నికల ఏడాది కావడంతో ఓటరు జాబితా సవరణపై రాజకీయ పార్టీలు దృష్టి పెడుతున్నాయి. ఇక ఓటర్లు కూడా తమ ఓటు ఉందా... అందులో వివరాలు సరిగ్గా ఉన్నాయా అనేది సరిచూసుకోవాలి. చిరునామా మారి ఉంటే నియోజకవర్గం పరిధిలో ఓటు బదిలీ చేయించుకోవాలి. 2024, జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండేవారు కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలి.

బీఎల్ఓలకు రిజిష్టర్లు, దరఖాస్తులు..

ఓటరు జాబితా సవరణలో భాగంగా ఇంటింటి సర్వే శుక్రవారం ప్రారంభమైంది. బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓ) ఆగస్టు 21 వరకు ఇంటింటి సర్వే నిర్వహించనున్నారు. సవరణకు సంబంధించి బీఎల్ఓ రిజిష్టర్లు, కొత్తగా ఓటరు నమోదుకు (ఫారం–6), ఓటు తొలగింపునకు (ఫారం–7), నియోకవర్గం పరిధిలో ఓటు బదిలీకి (ఫారం–8) దరఖాస్తులను నియోజకవర్గాల ఎన్నికల సిబ్బందికి జిల్లా ఎన్నికల యంత్రాంగం అందజేస్తోంది.

సర్వే ప్రాధాన్యతాంశాలు

- వయసు 18 ఏళ్లు నిండిన వారికి, 2024 జనవరి 1వ తేదీ నాటికి వయసు 18 ఏళ్లు నిండే వారికి ఓటు హక్కు కల్పించడం.
- ఓటరు జాబితాలో డబుల్ ఎంట్రీ, నకిలీ ఓట్ల గుర్తింపు.
- చనిపోయినవారి (మరణ ధ్రువపత్రం పరిశీలించి నకలు జతచేసి) ఓట్ల తొలగింపు.
- వందేళ్ల వయసు పైబడిన వారిని గుర్తించడం.
- ఇంటి నంబరు లేకుండా ఉన్న ఓట్లు, ఒకే ఇంటిపై పదుల సంఖ్యలో ఉన్న ఓట్ల పరిశీలన.
- సర్వీస్ ఓటర్లు (ఆర్మీ), ఎన్ఆర్ఐ ఓటర్ల వివరాలు సరిచేయడం.
- ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి ఓట్లను వారి అభీష్టం మేరకు ఏ ప్రాంతంలో ఉంచాలో తెలుసుకుని అక్కడి జాబితాలో ఉంచడం.
- ఒక పోలింగ్ బూత్‌లో గరిష్టంగా 1,500 ఓట్లకు మించి ఉంటే కొత్త పోలింగ్ బూత్‌కు సిఫారసు చేయడం.
- పేర్లు, చిరునామా, ఫోన్ నంబరు, చేర్పులు, తప్పులుంటే సరిచేయడం.
- ఓటరు అభ్యర్థన మేరకు ఓటు బదిలీ.

ఓటు సరిచూసుకోవాలి



ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. జాబితాలో ఓటు ఉందా... వివరాలు సరిగ్గా ఉన్నాయా అనే సమాచారాన్ని ప్రతి ఓటరూ సరిచూసుకోవాలి. తప్పులు ఉంటే సరిచేయించుకోవాలి. సరిదిద్దేందుకు ఆధారం కోసం బీఎల్ఓ అడిగిన పత్రాలు సమర్పించాలి. ముఖ్యంగా వయసు 18 ఏళ్లు నిండిన వారు, 2024, జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండేవారు ఓటరుగా నమోదు కావాలి.

– గాయత్రీదేవి, జిల్లా రెవెన్యూ అధికారి

క్లుప్తంగా

ఇరు వర్గాల ఘర్షణ

• ఆరుగురికి గాయాలు



తలకు తీవ్రగాయాలైన సుబ్బారెడ్డి

పెద్దపప్పూరు: పొలం రస్తా విషయమై దాయాదుల మధ్య ఘర్షణ జరిగింది. కట్టెలతో దాడి చేసుకున్నారు. ఈ ఘటన శుక్రవారం ముచ్చుకోట గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన జయసింహారెడ్డి, పెద్దిరెడ్డి నడుమ కొంత కాలంగా రస్తా వివాదం జరుగుతోంది. శుక్రవారం ఇదే విషయమై ఇరు కుటుంబాల వారు గొడవ పడ్డారు. చివరకు కట్టెలతో ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ సంఘటనలో పెద్దిరెడ్డి తండ్రి జయరామి రెడ్డి, సుబ్బారెడ్డికి తలకు తీవ్రగాయాలయ్యాయి. మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని స్థానికులు చికిత్స నిమిత్తం తాడిపత్రి ఏరియా ఆసుపత్రికి తరలించారు. జయరామి రెడ్డిని మెరుగైన చికిత్స కోసం అనంతపురం ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఖాజాహుస్సేన్ పేర్కొన్నారు.

కుక్కల దాడిలో 18 గొర్రెల మృతి



మృతి చెందిన గొర్రెలు

బ్రహ్మసముద్రం: కుక్కల దాడిలో 18 గొర్రెలు మృతి చెందాయి. మండల పరిధిలోని ఎరడికెర గ్రామంలో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన దొడ్డక్క గారి పాలక్కకు చెందిన గొర్రెల మందపై కుక్కలు దాడి చేశాయి. 18 గొర్రెలను చంపేశాయి. సమాచారం అందుకున్న మండల పశువైద్యాధికారి డాక్టర్ సూర్యనారాయణ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతి చెందిన గొర్రెల విలువ రూ. 60 వేలకు పైగా ఉంటుందని బాధితులు తెలిపారు.

ఆటో బోల్తా.. వ్యక్తి మృతి

కంబదూరు: ఆటో బోల్తా పడి వ్యక్తి మృతి చెందిన ఘటన వైసీ పల్లి–కళ్యాణదుర్గం రహదారిలో చోటుచేసుకుంది. వివరాలు.. వైసీ పల్లికి చెందిన శ్రీనివాసులు (50), మరో ముగ్గురితో కలిసి శుక్రవారం డ్రిప్ పైపులను తీసుకొని ఆటోలో కళ్యాణదుర్గం నుంచి వైసీ పల్లికి బయలుదేరాడు. వైసీ పల్లి సమీపంలో ఒక్కసారిగా ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. తీవ్రగాయాలైన శ్రీనివాసులు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య తులసమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనపై కంబదూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆడుతు పాడుతు పనిచేస్తుంటే...



ఉత్సాహంగా.. బురదలో మడక తోలుతున్న వ్యక్తి



వచ్చేశామోచ్. వరినారుతో పొలం చేరిన ఎడ్లబండి



పాటలు పాడుకుంటూ.. వరినాట్లు వేస్తున్న మహిళా కూలీలు

గత నాలుగు సంవత్సరాలూ వర్షాలు బాగా కురిశాయి. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ఇప్పటికీ కొన్ని చోట్ల చెరువులు నిండుకుండలా కనిపిస్తున్నాయి. దీంతో బోరు బావులు ఫుల్ రీచార్జ్ కావడంతో పుష్కలంగా నీళ్లు వస్తున్నాయి. రైతులు ముంగారు సేద్యం ప్రారంభించారు. బోరుబావుల కింద పంటల సాగు పనుల్లో బిజీబిజీగా గడుపుతున్నారు. పచ్చని పందిరిలా ఉన్న పొలాల్లో కూలీలు ఆనందంగా పనులు చేసుకుంటున్నారు. పాటలు పాడుతూ వరి నాట్లు వేస్తున్నారు. తోటి మనుషులతో ఉల్లాసంగా గడుపుతూ కష్టాన్ని మరిచిపోతున్నారు. శుక్రవారం అనంతపురం మండలం సోముల దొడ్డి గ్రామ సమీప పంట పొలాల్లో సేద్యం పనుల్లో మునిగిన కూలీలు, అక్కడి పరిస్థితులను 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



నేలమ్మా.. సిరులు కురిపించమ్మా: మడికి నీరు కడుతున్న యజమాని



ఆహా ఏమి రుచి..!: గడ్డి నేలలో కూర్చుని అన్నం తింటున్న కూలీలు

రూ.20కే భోజనం

• రైల్వే శాఖ శ్రీకారం
• గుంతకల్లు, రేణిగుంట రైల్వేస్టేషన్లలో ప్రారంభం



గుంతకల్లు రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు భోజనం విక్రయిస్తున్న దృశ్యం

గుంతకల్లు: రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం చవక ధరకు (ఎకానమీ మీల్స్) నాణ్యమైన ఆహారం అందిస్తున్నట్లు డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్ తెలిపారు. పైలట్ ప్రాజెక్టు కింద గుంతకల్లు డివిజన్‌లోని గుంతకల్లు, రేణిగుంట రైల్వేస్టేషన్లతోపాటు జోనల్‌లోని హైదరాబాద్, విజయవాడ రైల్వే స్టేషన్లలో అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. రైల్వే ప్రయాణికులకు నాణ్యమైన,పరిశుభ్రమైన భోజనాన్ని సరసమైన ధరలో అందించాలనే ఉద్దేశంతో భారతీయ రైల్వే ఎకానమీ మీల్స్ అనే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు.ముఖ్యంగా జనరల్ కోచ్‌లో ప్రయాణించే వారికి తక్కువ ధరతో రెండు రకాల భోజనాన్ని అందిస్తామన్నారు. మొదటి రకం ఎకానమీ భోజనం కేవలం రూ.20కు, రెండో రకం కాంబో రూ.50కు లభిస్తుందన్నారు. ఐఆర్‌సీటీసీ రిఫ్రెష్‌మెంట్ రూమ్‌లోని కిచెన్ యూనిట్లు, జన్ ఆహార్ సర్వీస్ కౌంటర్ల ద్వారా ప్రయాణికులకు అందిస్తున్నట్లు ఆయన వివరించారు. జనరల్ కోచ్‌ల సమీపంలోని ఫ్లాట్‌ఫాంపై సర్వీసు కౌంటర్లు ఉంటాయన్నారు. ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి దుర్మరణం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

తాడిపత్రి: రైలు నుంచి జారి పడి వ్యక్తి దుర్మరణం పాలైన ఘటన మండల పరిధిలోని కోమలి వద్ద జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. శుక్రవారం కోమలి గ్రామ రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం రైలు పట్టాల పక్కన పడి ఉన్నట్లు సమాచారం వచ్చింది. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడి మృతి చెందినట్లు గుర్తించారు. వ్యక్తి వయసు 45 సంవత్సరాలు ఉండవచ్చని తెలిపారు. కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రైతులకు అండగా ఉండాలి

• డీఏఓ ఉమామహేశ్వరమ్మ



వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏఓలు, ఏడీఏల సమావేశం

అనంతపురం అగ్రికల్చర్: రైతులకు అవసరమైన సూచనలు, సలహాలతో అండగా నిలవాలని వ్యవసాయశాఖ జిల్లా అధికారి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏఓలు, ఏడీఏలతో డీఏఓ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్‌లో ప్రధాన పంటలు, ప్రత్యామ్నాయ పంటలు సాగవుతున్నాయన్నారు. అధికారులందరూ క్షేత్రస్థాయిలో త్వరలోనే ఈ–క్రాప్ ప్రారంభించడానికి వీలుగా ఆర్‌బీకే స్థాయిలో సిబ్బందికి శిక్షణ ఇస్తామన్నారు. ఈ–క్రాప్ అనేది చాలా కీలకమైనందున రైతులకు ప్రభుత్వ ఫలాలు దక్కేలా పారదర్శకంగా చేపట్టాలని ఆదేశించారు. ఈ–క్రాప్ యాప్ పనితీరు గురించి బ్రహ్మసముద్రం, గార్లదిన్నె మండలాల్లో ఒక ఆర్‌బీకేను పైలట్‌గా తీసుకుని టెక్నికల్ ఏఓ బాలానాయక్ ప్రయోగాత్మకంగా వివరించారు. ప్రధాన పంటల సాగు విస్తీర్ణం లెక్కలు కచ్చితంగా అందుబాటులోకి వస్తే ఒక్క ఎకరా బీడు భూమి లేకుండా ఆగస్టులో ప్రత్యామ్నాయ ప్రణాళిక అమలు చేస్తామన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా ఆర్‌బీకేల్లో విత్తనాలు, ఎరువులు తగినంత నిల్వ ఉండాలన్నారు. పొలం బడి, రాయితీ విత్తన పంపిణీ, సీసీఆర్‌సీ పంపిణీ, భూసార పరీక్షలు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నమూనాల సేకరణ, ఇన్‌పుట్, ఇన్సూరెన్స్, రైతు భరోసా పథకాలతో పాటు పీఎం కిసాన్‌కు సంబంధించి పెండింగ్ లేకుండా నెలాఖరులోపు వంద శాతం ఈకేవైసీ పూర్తి కావాలని ఆదేశించారు.

మాతా శిశు మరణాలు నివారించాలి

• 'ఫ్యామిలీ డాక్టర్' నోడల్ అధికారి డాక్టర్ సుజాత



మాట్లాడుతున్న డాక్టర్ సుజాత

అనంతపురం క్రైం: మాతా, శిశు మరణాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైద్యాధికారులు, సిబ్బందిని ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమ నోడల్ అధికారి డాక్టర్ సుజాత ఆదేశించారు. గత నెలలో చోటు చేసుకున్న ఒక మాత, నాలుగు శిశు మరణాలపై శుక్రవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. సంబంధిత వైద్యాధికారులు, సిబ్బందికి చురకలంటించారు. మాతా, శిశు మరణాల పట్ల ప్రభుత్వం సీరియస్‌గా ఉందన్నారు. ఏ తల్లి కూడా జన్మనిస్తూ మరణించకూడదన్నారు. ముఖ్యంగా మహిళ గర్భం దాల్చినప్పటి నుంచే ఆశ, ఏఎన్‌ఎం, వైద్యాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విధిగా ఆంటినేటల్ చెకప్స్ చేయించాలన్నారు. పౌష్టికాహారం ఏవిధంగా తీసుకుంటున్నారో అంగన్‌వాడీ కేంద్రాలతో సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రధానంగా బిడ్డ బరువు తక్కువగా పుట్టకుండా గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేయాలన్నారు. హైరిస్క్ కేసుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. మరణాల్లో ఏమైనా తప్పిదాలు రుజువైతే కఠిన చర్యలు తప్పవని ఆమె స్పష్టం చేశారు. సమావేశంలో జీజీహెచ్ వైద్యులు డాక్టర్ పద్మశ్రీ, డాక్టర్ శంకర్‌నారాయణ, డాక్టర్ అరుణలత, డాక్టర్ హరిణి, 108 మేనేజర్ సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తగా పనిచేయకుంటే చర్యలు తప్పవు

• డీఈఓ సాయిరామ్



మాట్లాడుతున్న డీఈఓ సాయిరామ్

రాప్తాడురూరల్: జాగ్రత్తగా పనిచేయకుంటే చర్యలు తప్పవని డీఈఓ సాయిరామ్ హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం డెప్యూటీ డీఈఓలు, మండల విద్యాశాఖ అధికారులతో డీఈఓ వెబెక్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒళ్లు దగ్గర పెట్టుకుని పని చేయాలన్నారు. సెమిస్టర్–2 పాఠ్య పుస్తకాలు అన్ని మండలాలకు చేరాయన్నారు. శనివారం విద్యార్థులందరికీ పంపిణీ చేసి బయోమెట్రిక్ తీసుకోవాలన్నారు. వందశాతం పూర్తి కావాల్సిందేనని స్పష్టం చేశారు. జేవీకే బయోమెట్రిక్ 91.7 శాతం అయిందని, వందశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. సచివాలయాల వారీగా 6–18 ఏళ్లలోపు ఫెయిల్, డ్రాపౌట్స్ పిల్లలను గుర్తించాలన్నారు. ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లకు కూడా దీనిపై ఆదేశాలు అందాయన్నారు. సరైన ఆలోచన, అవగాహనతో పని చేయకపోతే ఇంటికిపోతారని హెచ్చరించారు. అందరి పనితీరు గురించి కలెక్టర్ దృష్టికి ఎప్పటికప్పుడు తీసుకెళ్తున్నామన్నారు. ఇప్పటికైనా సీరియస్‌గా తీసుకోకుంటే ఇబ్బంది పడతారని సూచించారు. చాలామంది టూర్ డైరీలు రాయడం లేదని, చేయాల్సిన పని గురించి అడిగితే రావాల్సిన వాటి గురించి మాట్లాడతారా? అని మండిపడ్డారు. ఇప్పటికైనా తీరు మార్చుకోవాలని హితవు పలికారు.

విద్యా వ్యవస్థలో హెచ్‌ఎంల పాత్ర కీలకం

• సీమాట్ డైరెక్టర్ మస్తానయ్య



క్యాంప్ ఫైర్‌ను ప్రారంభిస్తున్న సీమాట్ డైరెక్టర్ మస్తానయ్య

రాప్తాడురూరల్: విద్యా వ్యవస్థలో ప్రధానోపాధ్యాయుల పాత్ర కీలకమని సీమాట్ డైరెక్టర్ మస్తానయ్య తెలిపారు. 'లీడర్ షిప్' అంశంపై అనంతపురం నగర శివారులోని టీటీడీసీ కేంద్రంలో ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు జరుగుతున్న రీజనల్ స్థాయి శిక్షణలో శుక్రవారం రాత్రి క్యాంప్ ఫైర్, మ్యూజికల్ నైట్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మస్తానయ్య మాట్లాడుతూ విద్యా వ్యవస్థ సమర్థంగా ఉండాలంటే హెచ్‌ఎంలు అద్భుతమైన నాయకత్వ లక్షణాలు కల్గి ఉండాలన్నారు. దేశంలో విద్యా సంస్థల సమర్థ నిర్వహణకు సంబంధించిన నాయకత్వ శిక్షణలు ఇచ్చే సంస్థలు కేవలం పది రాష్ట్రాల్లోనే ఉన్నాయన్నారు. ప్రస్తుతం మన రాష్ట్రంలో ప్రభుత్వం విద్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో హెచ్‌ఎంలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దేశంలోనే విద్యాశిక్షణలో ఉత్తమ ఆచరణ పద్ధతులు కలిగిన స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ సహజంగా కొన్ని నాయకత్వ లక్షణాలు కల్గి ఉంటారని తెలిపారు. డీఈఓ సాయిరామ్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ప్రధానోపాధ్యాయులు తీసుకుంటున్న నాయకత్వ శిక్షణ సశాస్త్రీయంగా ఉందన్నారు. వారిని ఉత్తమ హెచ్‌ఎంలుగా తీర్చిదిద్దుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. డీఈఓ సాయిరామ్ ఆలపించిన గేయాలు ఆకట్టుకున్నాయి. దాండియా, నాటికలు, హాస్యవల్లరిలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డెప్యూటీ డీఈఓలు పద్మప్రియ, శంకరప్రసాద్, సీమాట్ ప్రొఫెసర్ మహేశ్వరరెడ్డి, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

దత్తతకు చిన్నారి

అనంతపురం సెంట్రల్: శిశు గృహలో ఆశ్రయం పొందుతున్న చిన్నారి ఆర్నా (2 సంవత్సరాలు)ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం దత్తతకు ఇవ్వాలని నిర్ణయించినట్లు ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. చిన్నారి సంబంధీకులు ఉంటే తగిన ఆధారాలతో సంప్రదించాలని కోరారు. లేదంటే అనాథగా పరిగణించి దత్తత ఇస్తామని పేర్కొన్నారు.

గర్భిణీ బలవన్మరణం



హుసేన్ బీ (ఫైల్)

యాడికి: గర్భిణీ బలవన్మరణం పొందిన ఘటన మండలంలోని రాయలచెరువు గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. ఎస్‌ఐ గురుప్రసాద్ రెడ్డి తెలిపిన మేరకు.. నంద్యాల జిల్లా వెల్దుర్తి మండలం రత్నంపల్లె గ్రామానికి చెందిన దస్తగిరి కుమార్తె హుసేన్ బీ(28)తో యాడికి మండలం రాయల చెరువు గ్రామానికి చెందిన నన్నేసాబుకు 8 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి 3 ఏళ్ల కుమారుడు ఉన్నాడు. హుసేన్‌బీ ప్రస్తుతం మూడు నెలల గర్భిణి. కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఆమె బాధపడుతోంది. ఈ క్రమంలోనే శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో జ్యూస్ తాగుతా తీసుకురమ్మని చెప్పడంతో ఇంటి నుంచి భర్త బయటకు వెళ్లాడు. తిరిగి వచ్చి పలకరిస్తే ఇంటి తలుపులు తీయలేదు. ఇరుగు పొరుగు వారితో కలిసి తలుపు పగులగొట్టి లోపలికి వెళ్లగా హుసేన్ బీ ఉరికి వేలాడుతూ కనిపించింది. కిందికి దింపి చూడగా అప్పటికే ప్రాణాలు విడిచింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఖాతాదారుల శ్రేయస్సే లక్ష్యం

• ఎస్‌బీఐ సీజీఎం నవీన్‌చంద్రజ



మహిళా సంఘాలకు చెక్కు అందజేస్తున్న ఎస్‌బీఐ సీజీఎం నవీన్‌చంద్రజ

అనంతపురం అగ్రికల్చర్: ఖాతాదారుల శ్రేయస్సే లక్ష్యంగా స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నిరంతరం పనిచేస్తుందని ఆ బ్యాంకు చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎం) నవీన్‌చంద్రజ తెలిపారు. జిల్లా పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్థానిక ఓ ప్రైవేట్ అతిథి గృహంలో సమావేశం నిర్వహించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆర్డీటీ సంస్థకు అంబులెన్స్ కొనుగోలుకు రూ.26.11 లక్షలు అందించారు. స్థానిక తిలక్‌రోడ్డు బ్రాంచి ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు రూ.10 కోట్ల చెక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటీర పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే వారికి తక్కువ వడ్డీరేట్లతో పెద్ద ఎత్తున రుణాలు అందిస్తామన్నారు. అనంతరం ఎస్‌బీఐ అందిస్తున్న రుణాలు, వివిధ సేవల అవగాహన నిమిత్తం నగరంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీజీఎం లేఖా మీనన్, ఆర్‌ఎం రమేష్, ఇతర అధికారులు, బ్రాంచి మేనేజర్లు, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక ప్రగతికే 'మెప్మా మార్కెట్లు'

• మెప్మా పీడీ విజయలక్ష్మి



మెప్మా అర్బన్ మార్కెట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణ మహిళల ఆర్థిక పరిస్థితులను మెరుగు పరిచేందుకే మెప్మా ఆధ్వర్యంలో అర్బన్ మార్కెట్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని మెప్మా పీడీ విజయలక్ష్మి తెలిపారు. పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మెప్మా అర్బన్ మార్కెట్ ఏర్పాటు చేశారు. పీడీ విజయలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, కమిషనర్ శ్రీనివాసులు, వైస్ చైర్‌పర్సన్‌లు బిందె వరలక్ష్మి, పద్మలత రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా పీడీ విజయలక్ష్మి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించుకునేందుకు మెప్మా మార్కెట్ ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 30 స్టాళ్లు ఉన్నాయని తెలిపారు. ఇక్కడ లభించే ఉత్పత్తులు రుచికరంగా ఉండడంతో పాటు చాలా చౌకగా లభిస్తాయన్నారు. ఆరోగ్యం భేషుగ్గా ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మెప్మా టీఎంసీ కెరన్, కో–ఆర్డినేటర్లు సుమన్ దుర్గ, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

300 క్వింటాళ్ల సబ్సిడీ బియ్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న బియ్యం ప్యాకెట్లతో అధికారులు

రాప్తాడు: ప్రభుత్వం పేదలకు సబ్సిడీపై అందిస్తున్న బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా దాడి చేసి స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ సీఐలు సాయిప్రసాద్, రామారావు తెలిపారు. వారు తెలిపిన వివరాలు.. నంద్యాల జిల్లా బనగానపల్లికి చెందిన శ్రీనివాసా రైస్ మిల్లు యజమాని శ్రీనివాసులు అలియాస్ డాన్ శీను ఓ లారీలో 300 క్వింటాళ్లను (600 ప్యాకెట్ల 50 కేజీల బియ్యం) కర్ణాటక రాష్ట్రంలోని తుమకూరుకు తరలించే ఏర్పాట్లు చేశారు. విజిలెన్స్ రీజనల్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ఈశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు రాప్తాడు మండలం మరూరు టోల్ ప్లాజా సమీపంలో విజిలెన్స్ సీఐలు సాయిప్రసాద్, రామారావు, తహసీల్దార్ లక్ష్మీ నరసింహ, సీఎస్‌డీటీ జ్యోతి వాహనాలు తనిఖీ చేస్తుండగా లారీ అక్కడికి వచ్చింది. అధికారులు అనుమానంతో తనిఖీ చేయగా, 300 క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు తెలిసింది. వీటికి ఎలాంటి బిల్లులు లేకపోవడంతో పాటు లారీకి కూడా ఎలాంటి ఆధారాలు లేవు. దీంతో లారీని సీజ్ చేసి అధికారులు బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతపురం సివిల్ సప్లయిస్ స్టాక్ పాయింట్‌కు తరలించారు. డ్రైవర్ కాంతారావు, క్లీనర్ శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు.

డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య

తాడిపత్రి: రైలు కింద పడి డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. రూరల్ పరిధిలోని పుట్లూరు రోడ్డు రైల్వే లెవల్ క్రాసింగ్ సమీపంలో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. రైల్వే డీఎస్పీ అబ్దుల్ అజీజ్ తెలిపిన మేరకు.. తాడిపత్రి పట్టణంలోని చేనేత కాలనీకి చెందిన చెన్నా భాస్కర్, భారతి దంపతుల కుమార్తె చెన్నా పావని (22) పట్టణంలోని ఓ ప్రయివేట్ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతోంది. కొన్ని రోజులుగా కడుపు నొప్పితో ఆమె బాధపడుతోంది. దీంతో సరిగా చదవక పరీక్షల్లో ఫెయిల్ అవుతానేమోనన్న దిగులుతో ఉండేది. ఈ క్రమంలోనే శుక్రవారం ఇంటి నుంచి వెళ్లిన పావని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

క్లుప్తంగా

ఓటరుకార్డులపై ఇంటింటా సర్వే



ఆత్మకూరులో ఓటరుకార్డులపై సర్వే చేస్తున్న మహిళా పోలీస్ షబానా

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా బీఎల్ఓలు, బీఎల్ఏల ఆధ్వర్యంలో ఓటరుకార్డులపై శుక్రవారం ఇంటింటా సర్వే నిర్వహించారు. ప్రతి ఇంటికీ తిరిగి ఓటరు కార్డులు పరిశీలించారు. తప్పులేమైనా ఉంటే ఫాం-8 ద్వారా బీఎల్ఓ యాప్‌లో అప్‌లోడ్ చేశారు. కొత్త ఓటు కార్డులు నమోదు చేయాలంటే ఫాం-6 ద్వారా , నూతన ఓటరు కార్డులను అప్‌లోడ్ చేశారు. ఎవరైనా మరణించి ఉంటే ఫాం -7 ద్వారా అప్‌లోడ్ చేశారు.

నేడు 'జగనన్న సురక్ష'

ఆత్మకూరు: మండలంలోని పంపనూరులో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయ్ ప్రసాద్, పంచాయతీ సెక్రటరీ శైలజ శుక్రవారం తెలిపారు. మండల స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలన్నారు.

భ్రూణహత్యలు చట్టరీత్యా నేరం



లింగ వివక్షపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ దయాకర్

ఆత్మకూరు: భ్రూణహత్యలు చట్టరీత్యానేరమని మండల వైద్యాధికారి దయాకర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని గొనిదిండ్ల తండాలో లింగ వివక్ష నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ పురుషులు 21 ఏళ్లు, మహిళలు 18 ఏళ్లు నిండిన తర్వాత వివాహం చేసుకోవాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో భాగంగా అసంక్రమిత వ్యాధులు, రక్తపోటు, మధుమేహం తదితర పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ నాగేశ్వరయ్య, సీహెచ్ఓ షమీమ్ తార, పీహెచ్ఎన్ తులసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి పౌరస్మృతి చారిత్రక అవసరం

- ప్రముఖ జర్నలిస్టు రాకా సుధాకర్



మాట్లాడుతున్న రాకా సుధాకర్

అనంతపురం కల్చరల్: ఉమ్మడి పౌరస్మృతి (యూనిఫాం సివిల్ కోడ్) చారిత్రక అవసరమని ప్రముఖ జర్నలిస్టు రాకా సుధాకర్ అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో ఆరెస్సెస్ ఆధ్వర్యంలో ఉమ్మడి పౌర స్మృతి అంశంపై సదస్సు జరిగింది. విశ్రాంత న్యాయమూర్తి సుబ్రమణ్యకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన విశిష్ట అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశమంతటా వివాహాలు, విడాకులు, వారసత్వం, దత్తత, జీవన భృతి, భరణం , ఉత్తరాధికారం తదితర అన్ని అంశాలపై కుల, మత, జాతి, ప్రాంత, భాషా బేధాలు లేకుండా దేశ పౌరులందరికీ ఒకే చట్టం వర్తించేలా ఉండే యూసీసీని అందరూ స్వాగతించాలన్నారు. వేర్వేరు చట్టాలతో దేశ సమగ్రతకు ప్రమాదమున్న విషయం అందరూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు, న్యాయవాదులు, విద్యావేత్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓటర్ల సర్వే ప్రారంభం

కనగానపల్లి: గ్రామాల్లో ఇంటింటా ఓటర్ల సర్వే కార్యక్రమం శుక్రవారం నుంచి ప్రారంభమైంది. మండలంలోని 35 పోలింగ్ బూతుల పరిధిలో స్థానిక బీఎల్ఓల ద్వారా ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రమాదేవి తెలిపారు. ఇందుకోసం అవసరమైన రికార్డులు, సామగ్రిని ఇప్పటికే బీఎల్ఓలకు అందజేసినట్లు తెలిపారు. ఈ సర్వే ద్వారా కొత్త ఓటర్ల నమోదుతో పాటు తొలగింపులు, చేర్పులు, మార్పులు చేస్తామన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా ఈ సర్వే ఉంటుందన్నారు.

భారతికి ఆర్థిక సాయం



భారతికి ఆర్థికసాయం అందిస్తున్న జీపీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు మల్లికార్జున

అనంతపురం అర్బన్: కూలి పనులు చేసుకుంటూ పీహెచ్‌డీ పట్టా పొందిన డాక్టర్ భారతికి జ్ఞాపిక ఎంటర్‌ప్రైజెస్ యజమాని సుమతి భాస్కర్, గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు మల్లికార్జుననాయక్ రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో భారతిని, ఆమె కుటుంబ సభ్యులను సన్మానించి, ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్ నాయక్, రవికుమార్ నాయక్, సాకే రామాంజనేయులు, ఫక్కీరప్ప, తదితరులు పాల్గొన్నారు.

బంజారాల సంక్షేమానికి కృషి

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



నాయక్‌నగర్‌లో రూ.25 లక్షలతో ఏర్పాటు చేస్తున్న బంజారా కమ్యూనిటీ హాలుకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: బంజారాల సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవి అని, వారి సంక్షేమానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు.33వ డివిజన్ నాయక్‌నగర్‌లో రూ.25 లక్షల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న బంజారా కమ్యూనిటీ హాల్‌కు మేయర్ వసీంతో కలసి ఎమ్మెల్యే అనంత వెంకటరామి రెడ్డి భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బంజారాలకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన సంత్‌సేవాలాల్ మహరాజ్ జిల్లావాసి కావడం అందరి అదృష్టమన్నారు. నాయక్‌నగర్‌లో నిరుపేదలు అధికంగా ఉన్నారని, అదే స్థాయిలో విద్యావంతులూ ఉన్నారన్నారు. గతంలో తాను ఎంపీగా ఉన్న సమయంలో నాయక్‌నగర్‌లో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. చాలా రోజులుగా ఇక్కడి ప్రాంత ప్రజలు కమ్యూనిటీ హాల్ కావాలని విన్నవించారని, వారి సౌకర్యార్థం ముఖ్యమంత్రి అభివృద్ధి నిధులు రూ.25 లక్షలు కేటాయించామన్నారు. అదనంగా మరిన్ని నిధులు కేటాయించి నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. డివిజన్‌కు అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తూ, సీసీ రోడ్లు, డ్రైనేజీలతో పాటు రెండు మీటర్ల వెడల్పుతో ప్రధాన కాలువల నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు.

ఏకలవ్యుడి విగ్రహ ఏర్పాటుకు చర్యలు:

గిరిజనుల ఆరాధ్యదైవం ఏకలవ్యుడి విగ్రహాన్ని త్వరలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. తన రాజకీయ ఎదుగుదలలో గిరిజనుల పాత్ర మరువలేనిదన్నారు. మేయర్ వసీం మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా నగరాభివృద్ధి జరుగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య కార్పొరేటర్లు సాకే చంద్రశేఖర్, బాలాంజనేయులు, కమల్‌భూషణ్, వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు సాకే రోజా, అంజలి, శోభ, ఉష, బంజారా నాయకులు జయరాం నాయక్, గోయింద్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

నగరంలోని ముంపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించామని, భవిష్యత్తులో ప్రజలు ఇబ్బందులు పడకుండా దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలకు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని 41వ డివిజన్ పరిధిలోని జనశక్తి నగర్‌లో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.80 లక్షలతో నిర్మించనున్న కాలువ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. బళ్లారి ఎంజీ మెటాలిక్స్ నుంచి జనశక్తినగర్ వరకు కాలువ ఏర్పాటు చేస్తున్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ రమణారెడ్డి, కార్పొరేటర్ గోగుల లక్ష్మీదేవి, నాయకులు రాధాకృష్ణ, విజయ్, సుహాసిని, రాజు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందజేత

నగరంలోని 49వ డివిజన్ ఇందిరాగాంధీనగర్‌కు చెందిన బొజ్జన్న అనే దివ్యాంగుడికి ప్రభుత్వం మంజూరు చేసిన ట్రై సైకిల్‌ను ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తన నివాసంలో శుక్రవారం అందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మునిశేఖర్, నాయకులు గౌస్‌బేగ్, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సామాజిక భద్రతే లక్ష్యం



బ్రోచర్లు విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం సిటీ: మైనార్టీల సామాజిక భద్రతే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని మేయర్ వసీం పేర్కొన్నారు. కామన్ సివిల్ కోడ్ (యూసీసీ) అంశంపై దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో మైనార్టీలకు సామాజిక భద్రత కల్పించే బాధ్యత తాను తీసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. శుక్రవారం నగరంలోని మారుతీనగర్‌లో గల మసీద్-ఏ-ఇనాయత్ మసీదులో ప్రత్యేక ప్రార్థనల్లో మేయర్ వసీం , ఉర్దూ అకాడమీ చైర్మన్ హిరియల్ నదీమ్ అహమ్మద్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్ యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లా బేగ్ పాల్గొన్నారు. అనంతరం మత పెద్దలు, ముస్లింలతో సమావేశమయ్యారు. పార్టీ నాయకులు ఖాజా, ముహీబ్, రఫీ, మసీదు ముతవల్లి జిలాన్, ఇమామ్ వలీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలు పరిశుభ్రంగా ఉంచాలి

నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ఖాళీ స్థలాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని మేయర్ వసీం ఆదేశించారు. శుక్రవారం 38వ డివిజన్‌లో జరుగుతున్న ముళ్ల కంపల తొలగింపు, పూడికతీత పనులను మేయర్ పరిశీలించారు. స్థల యజమానులు వారి స్థలాల్లో చెత్తాచెదారం వేసుకోకుండా, ముళ్ల కంపలు పెరగనివ్వకుండా చూసుకోవాలన్నారు. వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, కార్పొరేటర్ సైపుల్లాబేగ్, నాయకులు ఖాతా తదితరులు ఉన్నారు.

మణిపూర్ ఘటనపై ఏఐడీఎస్ఓ నిరసన



ఏఐడీఎస్ఓ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థినులు

అనంతపురం అర్బన్: మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించి, సామూహిక అత్యాచారానికి పాల్పడిన నేరస్తులను కఠినంగా శిక్షించాలని ఏఐడీఎస్ఓ ఆధ్వర్యంలో విద్యార్థినులు నగరంలో శుక్రవారం నిరసన తెలియజేశారు. సంఘం నగర అధ్యక్షుడు సురేశ్ మాట్లాడుతూ మణిపూర్ ఘటన సభ్యసమాజం తలదించుకునే చేసిన అత్యంత హేయమైన చర్యని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ లబ్ధి కోసం తెగల మధ్య ఘర్షణలను ప్రేరేపిస్తున్నారని విమర్శించారు. మణిపూర్‌లో ఘోరాలు చోటు చేసుకుంటుంటే, ప్రధాని నరేంద్రమోదీ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేశ్, చరణ్‌తేజ్, మహమ్మద్, ఎంఐఎంఎస్ఎస్ నాయకురాలు గౌతమి, ఏఐడీవైఓ నాయకుడు శివప్ప, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం టవర్ క్లాక్: నగరంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఎస్సీ,ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో మణిపూర్ ఘటనపై శుక్రవారం నిరసన తెలియజేశారు. ఎస్సీ,ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి మాట్లాడుతూ మణిపూర్‌లో ఇద్దరు మహిళలను వివస్త్రలను చేసి, అవమానించడం దారుణమన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు శింగంపల్లి కేశవ, రేకులకుంట రామాంజనేయులు, మంజునాథ, మురళీకృష్ణ, చెన్నకేశవ, రాజా, నారాయణ స్వామి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నోటుపుస్తకాల పంపిణీ

రామగిరి: గంతిమర్రి ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం ఆత్మీయ ట్రస్ట్ చైర్మన్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సెట్టిపి జయచంద్రారెడ్డి విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో ఏటా మండలంలోని పాఠశాలల్లో ఉచితంగా నోటుపుస్తకాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగార్జున, సర్పంచ్ చెన్నకేశవరెడ్డి, ఎంపీటీసీ కొండప్ప, ఎంఈఓలు మున్వర్‌బాషా, శ్రీనివాసులు, హెచ్ఎం అనంత పద్మనాభం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్మశానవాటికకు స్థల పరిశీలన

కనగానపల్లి: మామిళ్లపల్లి గ్రామంలో శ్మశానవాటిక కోసం స్థానిక ప్రజాప్రతినిధులు రెవెన్యూ సిబ్బందితో కలిసి శుక్రవారం స్థలాన్ని పరిశీలించారు. గ్రామంలోని పూసలకాలనీ సమీపంలో సర్వే నంబరు 392- 5లోని స్థలం ఇందుకు అనుకూలంగా ఉందని, దీనిపై మండల రెవెన్యూ అధికారులకు ప్రతిపాదనలు పంపాలని వీఆర్వో చెన్నకేశవులును సర్పంచ్ ఓబిరెడ్డి, నాయకులు అమరనాథరెడ్డి, తిరుపాలు, రవీంద్ర కోరారు. ఎస్‌డబ్ల్యూసీ చెత్తతో సంపద తయారీ కేంద్రం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని వారు కోరారు.

ఆరోగ్య కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి



డీఎంహెచ్ఓ డాక్టర్ యుగంధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వార్డు హెల్త్ కార్యదర్శులు

అనంతపురం క్రైం: వార్డు ఆరోగ్య కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ గ్రామ,వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగ సంఘం నాయకులు డీఎంహెచ్ఓ డాక్టర్ యుగంధర్‌కు విన్నవించారు. శుక్రవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో డీఎంహెచ్ఓకు వినతిపత్రం అందజేశారు. వార్డు హెల్త్ కార్యదర్శులకు గ్రేడ్ 3 నుంచి గ్రేడ్ 2కి మార్పు చేయాలని, వార్షిక ఇంక్రిమెంట్లు, జీఎన్ఎం కోర్సు పూర్తీ చేసిన వారికి పదోన్నతులు కల్పించాలని, అలవెన్స్‌లను అందజేయాలని విజ్ఞప్తి చేశారు. డీఎంహెచ్ఓను కలసిన వారిలో సంఘం రాష్ట్ర కార్యదర్శి వీ లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున, ప్రధాన కార్యదర్శి నరసింహులు, నాయకులు శివశంకరయ్య, మహేష్, గీత, నాగేశ్వరి, అఖిలభాను, రూప, నాగలక్ష్మి పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేయాలి : యుగంధర్

ప్రభుత్వ సంకల్పానికనుగుణంగా ప్రజలకు అంకితభావంతో సేవలందించాలని వైద్యాధికారులను డీఎంహెచ్ఓ యుగంధర్ ఆదేశించారు. శుక్రవారం ఎన్‌హెచ్ఎం పరిధిలో ఉన్న నాలుగు యూపీహెచ్‌సీ, సీహెచ్‌సీ వైద్యాధికారుల పోస్టులకు డీఎంహెచ్ఓ కార్యాలయంలో వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. కదిరి యూపీహెచ్‌సీకి డాక్టర్ నూర్‌బాషా, ధర్మవరం కొత్తకోట యూపీహెచ్‌సీకి డాక్టర్ ప్రియాంక, శింగనమల సీహెచ్‌సీకి డాక్టర్ జగదీష్‌నాయక్, కణేకల్ సీహెచ్‌సీకి డాక్టర్ హర్షవర్ధన్‌ను నియమిస్తూ డీఎంహెచ్ఓ ఉత్తర్వులు జారీ చేశారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుంచి 5 గంటల వరకు విధిగా ఆస్పత్రిలో ఉంటూ రోగులకు సేవలందించాలన్నారు. గర్భిణులకు అందించే సేవలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్ఎం కార్యక్రమ అధికారి డాక్టర్ చెన్నకేశవులు, తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ సేఫ్టీ కార్యాలయానికి వైద్యుడి నియామకం

జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆదేశాలతో జిల్లా ఆహార భద్రతాధికారి కార్యాలయానికి కురుకుంట పీహెచ్‌సీ వైద్యాధికారుడు డాక్టర్ మనోజ్‌ను అటాచ్ చేస్తూ డీఎంహెచ్ఓ డాక్టర్ యుగంధర్ ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో డాక్టర్ మనోజ్‌కు డాక్టర్ యుగంధర్ ఉత్తర్వుల ప్రతిని అందించారు. ఇక నుంచి జిల్లా ఆహార భద్రతాధికారులు చేసే తనిఖీల్లో వైద్యుడిగా డాక్టర్ మనోజ్ విధుల్లో పాల్గొంటారు.

త్వరలో వైఎస్సార్,సావిత్రిబాయి విగ్రహాల ఏర్పాటు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో భారతీయ సంఘ సంస్కర్త, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి విశేషంగా కృషి చేసిన సావిత్రిబాయి పూలే, డాక్టర్ వైఎస్సార్ విగ్రహాలను త్వరలో ఏర్పాటు చేస్తున్నట్లు వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి శుక్రవారం తెలిపారు. వీసీ మాట్లాడుతూ వర్సిటీలో సావిత్రిబాయి పూలే విగ్రహ ఏర్పాటుకు పాలక మండలి సమావేశంలో అభ్యర్థించడంతో సాంకేతిక కారణాలతో అనుమతి దక్కలేదన్నారు. త్వరలో జరగబోవు పాలక మండలి సమావేశంలో అనుమతి తీసుకొని సావిత్రిబాయి పూలే, డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. నిరుపేద, మధ్య తరగతి విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించడానికి ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించి, వెన్నుదన్నుగా నిలిచిన మహనీయుడు, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి స్మారకార్థంగా విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరినట్లు తెలిపారు. ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామన్నారు.

విరబూసిన బ్రహ్మకమలం



ఆత్మకూరు: మండల కేంద్రానికి చెందిన కరెంట్ పెద్దన్న ఇంటి ఆవరణలో బ్రహ్మకమలం చెట్టు ఏకంగా 42 పూలు పూసింది. సాధారణంగా ఏడాదికోసారి మాత్రమే ఈ చెట్టు పూలు పూస్తుంది. ఒకే చెట్టుకు ఇన్ని పూలు పూసిందని స్థానికులు ఆశ్చర్యంగా చూస్తున్నారు. కొన్ని పూలు పూజ కోసం స్థానికులు తొలగించారు.

తరిమెల నాగిరెడ్డి పుస్తకాల వితరణ

అనంతపురం కల్చరల్: విప్లవ దిక్సూచి తరిమెల నాగిరెడ్డి జీవితానికి అద్దంపట్టే ' తాకట్టులో భారతదేశం, ప్రజాసేవలో నాగిరెడ్డి' పుస్తకాలను జిల్లా కేంద్ర గ్రంథాలయానికి వితరణ చేస్తున్నట్లు రచయిత తరిమెల అమరనాథరెడ్డి శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా మానవతా సంస్థ కోకన్వీనర్ సలీంమాలిక్ స్వగృహంలో తరిమెల అమరనాథరెడ్డి, సలీంమాలిక్ విలేకరులతో మాట్లాడారు. శనివారం ఉదయం 11 గంటలకు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రచయితలతో కలిసి కేంద్ర గ్రంథాలయానికి 100కు పైగా పుస్తకాలు అందిస్తున్నట్లు తెలిపారు.

రక్తనిధి సేవలు విస్తృతం

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని రక్తనిధి ద్వారా ప్రైవేట్ ఆస్పత్రులకు సేవలు విస్తృతం చేసేలా చర్యలు తీసుకున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈమేరకు జీజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయ వర్గాలు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపాయి. ఇటీవల హెచ్‌డీఎస్‌లో సభ్యుల విజ్ఞప్తి మేరకు ప్రైవేట్ ఆస్పత్రులకు మరో ఐదు గంటల పాటు రక్త సేవలందించేలా చర్యలు తీసుకున్నారు. గతంలో ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే ప్రైవేట్ ఆస్పత్రులకు రక్తం ఇచ్చే పరిస్థితి ఉండేది. ఈ నెల 25 నుంచి నూతన విధానం అమలులో ఉంటుందని కార్యాలయ వర్గాలు తెలిపాయి. జీజీహెచ్‌లో పెథాలజిస్టులు, సీఎంఓలను అందుబాటులో ఉంచి, సేవల అందిస్తారని, ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు సద్వినియోగం చేసుకోవాలని ఆ ప్రకటనలో తెలిపాయి.

రేపు పాటల పోటీలు

అనంతపురం కల్చరల్: అనంత సింగర్స్ క్లబ్ ఆధ్వర్యంలో 'అనంత సూపర్ సింగర్' పాటల పోటీలు ఆదివారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సపారె రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 గంటలకు స్థానిక షిర్డీనగర్‌లోని వివేకానంద్ భవన్‌లో జరిగే పోటీల్లో పాల్గొనదలిచిన వారు సెల్: 9290200675లో సంప్రదించాలన్నారు.

సామాజిక సేవలోనే సంతృప్తి



పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ మీనా

రాప్తాడు: కరోనా సమయంలో రాప్తాడు మండలంలోని బుక్కచెర్ల గ్రామానికి చెందిన వలంటీర్ మీనాను స్థానిక ప్రజలు తమ సొంత బిడ్డలా అభిమానిస్తున్నారు. స్థానికులకు ఏ కష్టం వచ్చినా వలంటీర్ ఆదుకుంటుంది. డిగ్రీ చదువుకున్న వలంటీర్ సామాజిక సేవలోనే సంతృప్తి ఉందని భావించి 2019లో వలంటీర్‌గా చేరింది. నాలుగేళ్ల నుంచి ప్రభుత్వ పథకాలు సేవలపై ఇంటింటా తెలియజేసి, అర్హులకు వాటిని అందజేస్తోంది. తన పరిధిలోని 50 ఇళ్లలో ఏ అవసరాలు ఉన్న వారిలో కుటుంబ సభ్యురాలిగా సాయపడుతోంది. కరోనా సమయంలో వారికి అండగా నిలిచింది. ప్రాణాలను సైతం లెక్క చేయకుండా కరోనా విపత్కర సమయంలో కరోనా బాధితులను క్యారంటైన్‌కు పంపి, వారిని కాపాడడంలో తన వంతు సాయం అందించింది. భర్త కొండా రెడ్డి సాయంతో ధైర్యంగా ముందుకు వచ్చి సేవలు అందించింది.

నా సొంత బిడ్డల కంటే ఎక్కువ



నాకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు. వారి కంటే వలంటీర్ మీనా నాకు మక్కువ. సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించే మంజూరు చేయిస్తోంది. నాకు వెన్నముక దెబ్బతిని మంచాన పడ్డా. నాకు డీఎంఅండ్‌హెచ్ఓ పింఛన్ రూ.5 వేలు వలంటీర్ మీనానే మంజూరు చేపించింది. కరోనా సమయంలో సైతం ఎప్పటికప్పుడు మా ఆరోగ్య పరిస్థితులు తెలుసుకొని మందులు అందించేది. నా లాంటి నడవలేని వారు వలంటీర్ల రుణం తీర్చుకోలేనిది. వాళ్ల సేవలు ఎంత చెప్పిన తక్కువే.

\- కుమ్మరి నల్లప్ప, బుక్కచెర్ల, రాప్తాడు మండలం

సాంకేతిక పురోగతితోనే దేశాభివృద్ధి



అధ్యాపకులకు సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న జేఎన్‌టీయూఏ వీసీ రంగజనార్దన

అనంతపురం: సాంకేతిక పురోగతితోనే దేశాభివృద్ధి సాధ్యమని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్ధన అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం , ఐఐఐటీ డీఎం, కర్నూలు ఆధ్వర్యంలో ఏపీ ఉన్నత విద్య ప్లానింగ్‌బోర్డు సంయుక్తంగా నిర్వహించిన బూట్ క్యాంప్ ఆన్ డ్రోన్ టెక్నాలజీస్ అనే అంశంపై అధ్యాపకులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమానికి వీసీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ కాలానుగుణంగా సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు దీటుగా అధ్యాపకులు శిక్షణ పెంపొందించుకోవాలని కోరారు. ప్రతి విద్యార్థిలోనూ నైపుణ్యాలు పెంపొందించే రీతిలో అధ్యాపకులు సంసిద్ధం కావాలన్నారు. వ్యవసాయానికి డ్రోన్‌టెక్నాలజీ అధికంగా వినియోగిస్తున్నారన్నారు. పంట పర్యవేక్షణ, తెగులు నియంత్రణ, నీటి పారుదల, పంట విశ్లేషణలో డ్రోన్‌లను వినియోగించాలని కోరారు. బెస్ట్ యూనివర్సిటీ, ఎస్కే యూనివర్సిటీ, ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు శిక్షణలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ అనంతపురం రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి. ఈశ్వర్ రెడ్డి, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్‌వీ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అరుణకాంతి, సమన్వయకర్తలు డాక్టర్ కే కళ్యాణిరాధ, ప్రొఫెసర్ డి. విష్ణువర్ధన్, డాక్టర్ కేవీ ఈశ్వరమూర్తి, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ ఎం. రామశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుపై అవగాహన పెంచుకోవాలి



గుండెపోటుకు గురైన సమయంలో తీసుకోవాల్సిన తక్షణ జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సుభాష్

అనంతపురం సిటీ: ఎవరికైనా గుండెపోటు వస్తే తక్షణం ఎలా స్పందించాలనే అంశంపై ప్రతి ఒక్కరూ కనీస అవగాహన కలిగి ఉండాలని అనంతపురం ఎస్పీ శ్రీనివాసరావు, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి కార్డియాలజీ విభాగం హెచ్ఓడీ, కార్డియాలజిస్ట్ డాక్టర్ పవన్‌కుమార్ పోలీసులకు అవగాహన కల్పించారు. స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో సీపీఆర్ విధానంలో గుండెపోటుకు గురైన వ్యక్తికి ఎలా ప్రాణాపాయం నుంచి బయటపడేయొచ్చో ప్రయోగాత్మకంగా వివరించారు. విధి నిర్వహణలో ఉన్న సమయంలో ఒక్కోసారి గుండెపోటుకు గురై ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఆ సమయంలో సీపీఆర్ పద్ధతి ద్వారా మళ్లీ అవయవాలు పని చేసేలా చూడొచ్చన్నారు. గుండెపోటుకు గురైనట్లు గుర్తించిన వెంటనే సదరు వ్యక్తి ఛాతీపై రెండు చేతులు ఉపయోగించి ప్రాణాలు కాపాడొచ్చన్నారు. ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు, పోలీస్ వైద్యుడు వెంకటేశ్వర్లు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులకు శారీరక దారుఢ్యం అవసరం

పోలీసులకు శారీరక దారుఢ్యం చాలా కీలకమని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో జరుగుతున్న అనంతపురం, రూరల్ పోలీస్ సబ్ డివిజన్ల సివిల్ పోలీసులు, ఏఆర్ సాయుధ బలగాలు, స్పెషల్ పార్టీ, హోంగార్డుల పరేడ్‌ను ఎస్పీ శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పోలీసులందరూ క్రమం తప్పకుండా మైదానానికి వెళ్లి, ప్రాక్టీస్ చేయడం వల్ల శారీరక దారుఢ్యంతోపాటు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. మరోవైపు కుటుంబానికి కూడా ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనంతరం ఏఆర్, స్పెషల్ పార్టీ, హోంగార్డులతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిపరిష్కారానికి సానుకూలంగా స్పందించారు. ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న అమెరికా అమ్మాయి నృత్యం



శాస్త్రీయ నృత్యం చేస్తున్న క్రితి



పియానోపై జాతీయ గీతాలనాలపిస్తున్న ద్రితి

అనంతపురం కల్చరల్: అమెరికాలో స్థిరపడిన అనంత కళాకారిణి క్రితి అరంగేట్రంతోనే ఆకట్టుకుంది. అమెరికాలో నేర్చుకున్న శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించడానికి అమెరికా నుంచి అనంతకొచ్చిన క్రితి శుక్రవారం సాయంత్రం స్థానిక టీటీడీ కల్యాణ మంటపంలో నృత్య ప్రదర్శన ఇచ్చింది. అన్నమయ్య, త్యాగయ్య సంకీర్తనలపై క్రితి చేసిన అభినయం, హావభావాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. భారతీయ మూలలను వదలని నాట్యగురువులు అపర్ణ సుందరంతో పాటు ఆర్కెస్ట్రా బృందం అమెరికా నుంచి వచ్చి తమదైన ప్రతిభతో ఆకట్టుకున్నారు. ఆమె చెల్లెలు ద్రితి పియానోపై జాతీయ గీతాలు వాయించి, అందరినీ ఆశ్చర్యపరిచింది. ముఖ్య అతిథి, నాట్యాచార్యులు సంధ్యామూర్తి మాట్లాడుతూ భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను ఇక్కడి వారే మర్చిపోతున్న తరుణంలో అమెరికా అమ్మాయిలు చక్కగా అభినయించడం అభినందనీయమన్నారు. క్రితి, ద్రితిలకు ఎంతో మంచి భవిష్యత్తుందని ఆశీర్వదించారు.




నిన్న మొన్నటి దాకా చెమటలు పట్టించిన ఎండలు కాస్తా ఇప్పుడు మబ్బుల వెనక దాక్కుని, వానలు కురిపిస్తున్నాయి. వానలు ఆహ్లాదంగానే ఉంటాయి. అయితే సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే వ్యాధులను కూడా వెంట మోసుకొస్తాయి. ఈ అనారోగ్యాలతో పోరాడటానికి. రోగనిరోధకశక్తి బలంగా ఉండటం చాలా ముఖ్యం. వర్షాకాలంలో వ్యాధి నిరోధక శక్తిని మరింత పెంచుకోవడానికి నిత్యం తీసుకునే ఆహారంలో కొన్ని మార్పులు చేసుకోవడం అవసరం. ఆ మార్పులేమిటో, ఈ సీజన్‌లో ఏ ఆహారం తీసుకుంటే మంచిదో చూద్దాం...

ఈ ఆహారం తింటే...

చినుకుల్లోనూ చింత ఉండదిక



ముసురు పట్టినప్పుడు వేడి వేడి టీ, కాఫీలు తాగుతుంటారు. అయితే వాటికి బదులు గ్రీన్ టీ, బ్లాక్ టీ, హెర్బల్ టీ వంటివి తీసుకోవాలి. దాంతోపాటు అల్లం, మిరియాలు, తేనెతో తయారు చేసిన టీ సేవిస్తే.. ఆరోగ్యానికి చాలా మంచిది. అదేవిధంగా బజ్జీలు, పునుగులు, బోండాలకు బదులు వేడి వేడి ఉగ్గాణి, సెనగ, పెసర గుగ్గిళ్లు, చుదువా, సగ్గుబియ్యం కిచిడీ మంచిది. పుదీనా, తులసి ఆకుల్లో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ గుణాలు అధికంగా ఉంటాయి కాబట్టి వీటితో కషాయం కాచుకుని తాగితే మంచిది. రాగులు, సోయా బీన్, పెసలు, మొక్కజొన్న వంటి పప్పుధాన్యాలను ఆహారంలో భాగంగా చేసుకుంటే ఎలాంటి అనారోగ్య సమస్యలూ దరిచేరవు. వీటితోపాటు పోషక విలువలు ఎక్కువగా ఉండే కూరగాయలు, పండ్లు అంటే దానిమ్మ, ఆపిల్, స్ట్రాబెర్రీ, అరటి, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, బచ్చలి కూర వంటివి తీసుకుంటే మంచిది.



అల్లం: ఇది శరీర కణజాలాలకు పోషకాలను సమీకరించడానికి, సరఫరా చేయడానికి తోడ్పడుతుంది. ఈ రోజుల్లో జలుబు, దగ్గు వంటి సమస్యలు సర్వసాధారణం. అల్లం కఫాన్ని తగ్గిస్తుంది కాబట్టి అల్లం టీ తాగితే జలుబు, దగ్గు దూరం అవుతాయి. ఫ్లూతో పోరాడటానికి అల్లం తోడ్పడుతుంది. అల్లంలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు రోగనిరోధక శక్తినీ మెరుగుపరుస్తాయి. టీలు, సూప్‌లు, కూరల్లో అల్లాన్ని ఎక్కువ ఉపయోగిస్తే వ్యాధి నిరోధకతను పెంచుకోవచ్చు.



నేరేడు పండు... ఈ పండులో ఉండే విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు, ఖనిజాలూ ఫైటోకెమికల్స్లూ రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తాయి. నేరేడులో క్యాలరీలు తక్కువ. వానాకాలంలో వచ్చే అతిసార, కలరా వ్యాధులతో పాటు ఇతరత్రా ఇన్ఫెక్షన్లకీ నేరేడు ఔషధంలా పనిచేస్తుంది.

తులసి... ఈ కాలంలో రోజూ తులసి ఆకులను నమలడం ద్వారా అనారోగ్యాల నుంచి రక్షణ పొందవచ్చు. ఐదు తులసి ఆకులను రాత్రంతా నీటిలో నానబెట్టి.. మరుసటి రోజు ఉదయం పరగడుపునే ఆ ఆకులు తిని.. నీటిని తాగాలి. తులసి రోగనిరోధక వ్యవస్థను బూస్ట్ చేస్తుంది.



నిమ్మ... నిమ్మరసంలో విటమిన్ సి సమృద్ధిగా ఉంటుంది. ఇది శక్తిమంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేసి రోగనిరోధక శక్తిని పెంపొందిస్తుంది. అంతేకాదు, శరీరంలో తెల్ల రక్త కణాల ఉత్పత్తిని పెంచుతుంది. ఇది ఇన్ఫెక్షన్లు, అంటువ్యాధుల నుంచి శరీరాన్ని రక్షిస్తుంది.

మిరియాలు... నల్ల మిరియాలలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో సహాయపడతాయి. జీవక్రియలను పెంచుతాయి. దగ్గు, గొంతు నొప్పి ఉన్నట్లయితే నల్ల మిరియాలను పొడి చేసి నిద్రవేళకు ముందు వేడి పాలలో కలుపుకొని తాగితే ఆరోగ్యానికి చాలా మంచిది.



పసుపు... పసుపులో యాంటీ బాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరాన్ని అనేక వ్యాధుల నుంచి రక్షించడంలో సహాయపడతాయి. రోజూ రాత్రిపూట చిటికడు పసుపు కలిపిన వేడి పాలు తాగితే రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

వీటికి దూరంగా ఉండటం మేలు!

రోగనిరోధక శక్తిని బలోపేతం చేయాలంటే చక్కెర పదార్థాలకి దూరంగా ఉండాలి. ముఖ్యంగా ఐస్ క్రీం, కేక్, క్యాండీ, చాక్లెట్, కూల్‌డ్రింక్స్ తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి తగ్గుతుంది. అలాగే ఉప్పు ఎక్కువగా ఉండే ఆహారాలు ఆరోగ్యానికి చాలా హాని కలిగిస్తాయి. రోగనిరోధక శక్తిని బలహీనపరుస్తాయి. చాలామంది ప్యాక్ చేసిన ఆహారాలని తినడానికి ఎక్కువగా ఇష్టపడతారు. కానీ ఇవి ఆరోగ్యానికి మంచివి కావు. అధిక ఉప్పు ఆటో ఇమ్యూన్ వ్యాధి ప్రమాదాన్ని పెంచుతుంది. అలాగే ఆల్కహాల్, ధూమపానం కూడా శరీరాన్ని బలహీనంగా మారుస్తాయి. అందుకే వీటికి వీలైనంత దూరంగా ఉంటే మేలు.

లవంగం... ఇది రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి పనిచేస్తుంది. వర్షాకాలంలో లవంగాలను తీసుకుంటే గొంతు నొప్పి వంటి సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు.





దాల్చిన చెక్క... అద్భుత ఔషధ గుణాలెన్నో దాగి ఉన్న దాల్చిన చెక్క మధుమేహులకు రక్తంలో చక్కెర శాతాన్ని తగ్గిస్తుంది. రోజూ గ్లాసు పాలలో దాల్చిన చెక్క పొడి కలుపుకొని తాగితే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అంతేకాదు, శరీరంలో ఉండే కొవ్వు శాతాన్ని తగ్గించే గుణం దీనిలో ఇమిడి ఉంది.

ఉదయాన్నే పిల్లల్ని తయారు చేసి స్కూలుకు పంపించడం పేరెంట్స్‌కు పెద్దపని. ఇంతకంటే వాళ్లను నిద్రలేపడం అతిపెద్ద టాస్క్. ఎంత లేపినా నిద్ర లేవరు. కింద స్కూల్ ఆటోనో, బస్సో వచ్చి హారన్ కొడుతుంటుంది. కానీ వీళ్లు లేవరు. వీళ్లను తొందరగా నిద్ర లేపాలంటే ఇలా ప్రయత్నించి చూడండి....

బడికి వెళ్లనని మారాం చేస్తున్నారా?



సమస్యను అర్థం చేసుకోవాలి
ముందుగా నిద్ర లేవడానికి ఏమైనా ఇబ్బంది పడుతున్నారేమో గమనించాలి. రాత్రి సరిగా పడుకున్నారా లేదా... అసలు నిద్రపట్టలేదా... ఇంకేదైనా సమస్య ఉంటే అనునయంగా అడిగి తెలుసుకోవాలి.

సరిపోయిందా లేదా?
స్కూలుకెళ్లే పిల్లలు కనీసం పదిగంటలు నిద్రపోవాలి. గేమ్స్, ఫోన్లు చూస్తూ సరిగా పడుకోరు. రోజూ ఒక నిర్దేశిత సమయాన్ని కేటాయించి వాళ్లు కచ్చితంగా పడుకునేలా చేయాలి.

ప్రేమతో లేపాలి
ఉదయం ఎంత ఉత్సాహంగా లేస్తే రోజంతా అలానే గడుస్తుంది. అందుకే పిల్లలు త్వరగా లేవకపోయినా ప్రేమగా నిద్రలేపాలి. పిల్లలకు అర్థమయ్యే ప్రేమ భాషలోనే నిద్ర లేపాలి. ఇందుకోసం వాళ్లకు నచ్చే మంచి విషయాలు, స్కూలుకు వెళ్లడం ఎంతముఖ్యమో ప్రేమతో చెప్పాలి.

ఇష్టమైన ఫుడ్
పిల్లలు ఇష్టంగా తినే ఆహారాన్ని బ్రేక్‌ఫాస్ట్‌లో ఇవ్వాలి. అది తినడం కోసం అయినా త్వరగా నిద్ర లేస్తారు. ఈ నాలుగు చిట్కాలు ప్రయత్నిస్తే మీ సమస్య తీరినట్టే.

దిండు లేకుండా పడుకోలేరా?

రాత్రిపూట నిద్రించేటప్పుడు చాలా మంది తలకింద దిండు పెట్టుకొని పడుకుంటారు. అయితే తక్కువ ఎత్తు ఉన్న దిండు ఫరవాలేదు కానీ, పెద్ద దిండు పెట్టుకోవడం వల్ల చాలా ఆరోగ్య సమస్యలు ఏర్పడుతాయి. ఇది మొదట్లో తెలియదు కానీ కొన్ని రోజులు గడిచిన తర్వాత ముందుగా మెడ నొప్పి ఎదురవుతుంది. ఈ నొప్పి దీర్ఘకాలికంగా వేధిస్తుంది. కొంతమందికి ఉదయం నిద్రలేవగానే వెన్నులో నొప్పితో బాధపడతారు. మీకు ఇలాంటి సమస్య ఎదురైతే పడుకునేటప్పుడు మీరు ఎత్తయిన దిండు ఉపయోగిస్తున్నట్లు లెక్క. దీనివల్ల వెన్నెముక వంగిపోతుంది. డిస్క్‌లలో దూరం పెరిగి వెన్నునొప్పి వస్తుంది. అందువల్ల దిండు లేకుండా నిద్రించడం అలవాటు చేసుకోవాలి.



తలలో రక్త ప్రసరణ జరగదు: ఎత్తయిన దిండు పెట్టుకొని నిద్రపోతే తలకి రక్త సరఫరా సరిగ్గా జరగదు. రాత్రిపూట చాలా గంటలు ఇలాగే ఉండటం వల్ల రక్త సరఫరా లేక జుట్టుకు సరైన పోషణ లభించదు. దీనివల్ల జుట్టు రాలే సమస్య మొదలవుతుంది. అంతేకాదు, తరచు తలనొప్పి వస్తుంది. లావుపాటి దిండు పెట్టుకొని నిద్రించడం వల్ల శరీరంలోని కొన్ని భాగాలకి రక్త సరఫరా సరిగ్గా అందక తిమ్మిర్ల సమస్యలు ఏర్పడుతాయి. అందువల్ల మెడనొప్పి ఉండకూడదంటే తక్కువ ఎత్తు ఉండే చిన్న దిండుని ఉపయోగించాలి లేదంటే మెత్తటి టవల్ లేదా పలుచటి దుప్పటిని మడత పెట్టి తలకింద పెట్టుకోవడం ఉత్తమం.

హెల్త్ టిప్స్

మందారం ఆకుల్ని నూరి షాంపూగా వాడితే జుత్తు బాగా పెరుగుతుంది. చుండ్రు నివారణలోనూ, తెల్ల వెంట్రుకల నిరోధకంలోనూ సాయమవుతుంది. కప్పు నీటిలో ఒక మందార పువ్వు వేసి మరిగించి ఆ నీళ్లను తాగితే రక్తంలో ఐరన్ పెరుగుతుంది.

కరివేపాకులో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఓ 10 ఆకులతో పేస్ట్ తయారు చేసి మజ్జిగలో కలిపేసుకుని రోజూ తాగితే కాలేయం వ్యర్థపదార్థాల నుంచి రక్షణ పొందుతుంది. రోజూ ఓ 8 ఆకుల్ని మిరియాలతో కలిపి తింటే ముక్కులో వచ్చే అలర్జీలు తగ్గిపోతాయి.

రోజూ రెండు మూడు పుదీనా ఆకుల్ని నమిలి మింగుతుంటే జీర్ణశక్తి పెరిగి, కడుపు ఉబ్బరం, తేన్పులు తగ్గుతాయి. శ్వాసకోశాల శక్తి పెరుగుతుంది.

వేపాకు, యాంటీ సెప్టిక్‌గానూ, క్రిమి సంహారిణిగానూ బాగా పనిచేస్తుంది. వేపాకు పొడిని నీళ్లల్లో కలిపి చల్లితే ఎన్నో రకాల క్రిమి కీటకాలు దూరంగా వెళ్లిపోతాయి. వేపాకుల్ని నీటిలో వేసి మరిగించి స్ప్రే చేస్తే దోమల బెడద తప్పుతుంది. వేపాకు పొడిని పేస్ట్‌గా చేసి వాడితే పలు రకాల చర్మ సమస్యలు, మొటిమలు, ఎగ్జిమాల బాధలు తప్పుతాయి.

పసుపును పేస్ట్‌గా రోజూ ముఖానికి వాడితే, ముఖం మీద ఉండే సన్నని వెంట్రుకలు రాలిపోతాయి. అలాగే మొటిమలు, మచ్చలు కూడా మాయమవుతాయి. ఇది గొప్ప యాంటీ ఆక్సిడెంటు కాబట్టి రోజు మొత్తంలో ఒక టీ స్పూను దాకా కడుపులోకి తీసుకోవచ్చు.



సినిమా

అంతం ఆరంభమవుతుంది!


● ప్రభాస్

వెండితెరపై ప్రభాస్ కల్కి అవతారం ఎత్తారు. ప్రభాస్, కమల్‌హాసన్, అమితాబ్ బచ్చన్, దీపికా పదుకోన్, దిశా పటానీ ముఖ్య తారలుగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో 'ప్రాజెక్ట్ కె' వర్కింగ్ టైటిల్‌తో ఓ సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ రూపొందుతున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం అమెరికాలో జరుగుతున్న 'శాన్ డియాగో కామిక్ కాన్ – 2023' వేడుకలో ఈ సినిమాకు 'కల్కి 2898 ఏడీ' టైటిల్‌ను ఖరారు చేసినట్లు శుక్రవారం వెల్లడించి, గ్లింప్స్ వీడియోను రిలీజ్ చేశారు. 'ప్రపంచాన్ని చీకటి కమ్మేసినప్పుడు ఒక శక్తి ఉద్భవిస్తుంది. అప్పుడు అంతం ఆరంభం అవుతుంది' అన్నట్లుగా ఈ వీడియోలో ఉంది. ఈ వేడుకలో కమల్‌హాసన్ మాట్లాడుతూ– ''మేం స్టోరీలు చేస్తుంటే వారు (ఆడియన్స్) మమ్మల్ని స్టార్స్ చేస్తున్నారు. 'కల్కి 2898 ఏడీ'లో పెద్ద విజన్ ఉంది. ఈ సినిమాలో భాగం కావడం గౌరవంగా ఉంది'' అన్నారు. ''ఈ సినిమాలో నాగ్ అశ్విన్ నా క్యారెక్టర్‌ను డిజైన్ చేసిన తీరు బాగా నచ్చింది. సినిమాలో స్ట్రాంగ్ ఎమోషన్స్ ఉన్నాయి'' అన్నారు ప్రభాస్. ''ఈ సినిమా నాకో అద్భుతమైన అనుభవం. దీని వెనక గొప్ప పరిశోధన ఉంది'' అని వర్చ్యువల్‌గా అమితాబ్ బచ్చన్ మాట్లాడారు. ''నేను సైన్స్ ఫిక్షన్, పురాణాలను ఇష్టపడతాను. మహాభారతం, స్టార్ వార్స్... రెండింటినీ చూస్తూ, వింటూ పెరిగాను. ఈ రెండు ప్రపంచాలను కలిపే ఒక గొప్ప సినిమా చేయాలనుకున్నప్పుడు 'కల్కి 2898 ఏడీ' పుట్టింది'' అన్నారు నాగ్ అశ్విన్. ''ఈ సినిమా మాకు గర్వ కారణం'' అన్నారు నిర్మాత అశ్వనీదత్. ఈ వేడుకలో రానా, ప్రియాంకా దత్, స్వప్నా దత్ పాల్గొన్నారు. 'కల్కి 2898 ఏడీ'ను 2024 జనవరి 12న రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

రామ్‌చరణ్‌తో కలిసి నటిస్తా: ప్రభాస్

రామ్‌చరణ్‌తో కలిసి నటిస్తానని ప్రభాస్ 'కామిక్ కాన్–2023' వేడుకల్లో చెప్పారు. ఈ వేడుకల్లో 'ఆర్ఆర్ఆర్' సినిమా ప్రస్తావన రాగా... ''భారతదేశంలో ఉన్న అద్భుతమైన దర్శకుల్లో రాజమౌళి గారు ఒకరు. 'ఆర్ఆర్ఆర్' సినిమాలోని పాటకు ఆస్కార్ రావడం నాకు చాలా సంతోషంగా అనిపించింది. అది దేశ ప్రజలందరికీ దక్కిన గౌరవంగా భావించాం. అలాగే రామ్‌చరణ్ నాకు మంచి మిత్రుడు. ఏదో ఒక రోజు మేం కచ్చితంగా కలిసి సినిమా చేస్తాం'' అని చెప్పుకొచ్చారు ప్రభాస్.


● చిరంజీవి, తమన్నా

మిల్కీ బ్యూటీ... నువ్వే నా స్వీటీ

'అచ్చ తెలుగు పచ్చి మిర్చి మగాడు వీడే.. బొంబాటు ఘాటు హాటు హాటుగున్నాడే.. కల్లోకి వచ్చేసి కన్నెగుండెల్లో సూది గుచ్చి పిల్లా నీ ముచ్చటేంది అన్నాడే...' అంటూ రొమాంటిక్ మోడ్‌లోకి వెళ్లిపోయారు హీరోయిన్ తమన్నా. చిరంజీవి టైటిల్ రోల్‌లో నటించిన తాజా చిత్రం 'భోళా శంకర్'. ఈ చిత్రంలో చిరంజీవి సరసన తమన్నా నటించగా, ఆయన చెల్లెలి పాత్రలో కీర్తీ సురేష్ నటించారు. మెహర్ రమేష్ దర్శకత్వంలో అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 11న విడుదల కానుంది. ఈ చిత్రంలోని 'మిల్కీ బ్యూటీ.. నువ్వే నా స్వీటీ..' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను శుక్రవారం విడుదల చేశారు. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించిన ఈ పాటను విజయ్ ప్రకాష్, సంజన కల్మంజేతో కలసి ఈ చిత్ర సంగీతదర్శకుడు మహతి స్వర సాగర్ ఆలపించారు.


● సుదీప్, అమలాపాల్

యాక్షన్ హెబ్బులి

సుదీప్, అమలా పాల్ జంటగా ఎస్. కృష్ణ దర్శకత్వంలో రూపొందిన కన్నడ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ 'హెబ్బులి'. ఈ సినిమాను అదే టైటిల్‌తో సి. సుబ్రహ్మణ్యం ఆగస్టు 4న తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ– ''ఫ్యామిలీ ఎమోషన్స్, యాక్షన్, రొమాంటిక్ సీన్స్ మిళితమై ఉన్న పక్కా కమర్షియల్ ఫిల్మ్ 'హెబ్బులి'. కన్నడంలో రూ. 100 కోట్లు సాధించింది. తెలుగులోనూ హిట్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు.


● వైష్ణవ్ తేజ్


● మహేశ్‌బాబు


● టొవినో థామస్

కిక్... పంచ్...

విలన్ ముఖం మీద హీరో పంచ్ ఇవ్వాలా? కాలితో ఒక్క కిక్ కొట్టాలా? గాల్లో ఎగిరి పల్టీలు కొట్టి మరీ విలన్‌ని కొట్టాలా? ఇవన్నీ చేయాలంటే కాస్త ట్రైనింగ్ కావాలి. రెగ్యులర్ ఫైట్స్‌కి అయితే అక్కర్లేదు. బీభత్సమైన ఫైట్స్‌కి అయితే శిక్షణ తీసుకోవాల్సిందే. అది హీరో అయినా హీరోయిన్ అయినా. ఈ మధ్య రిస్కీ రోల్స్ ఒప్పుకున్న కొందరు స్టార్స్ 'మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్' నేర్చుకోవడానికి ప్రిపేర్ అయ్యారు. కిక్ బాక్సింగ్, కరాటే, కుంగ్ ఫూ, జూడో, కలరి పయట్టు వంటివన్నీ మార్షల్ ఆర్ట్స్ కిందే వస్తాయి. ఫైట్‌కి సూట్ అయ్యే ఆర్ట్ నేర్చుకుని బరిలోకి దిగనున్న స్టార్స్ గురించి తెలుసుకుందాం.

మూడు నెలలు బ్యాంకాక్‌లో...
హీరో మహేశ్‌బాబు– డైరెక్టర్ రాజమౌళి కాంబినేషన్‌లో ఓ భారీ చిత్రం రూపొందనున్న విషయం తెలిసిందే. ఆఫ్రికన్ అడవుల నేపథ్యంలో జరిగే ఈ కథలో భారీ యాక్షన్ సన్నివేశాలు ఉంటాయట. పోరాట సన్నివేశాలు సహజంగా ఉండేందుకు కెరీర్‌లో తొలిసారి ఈ సినిమా కోసం మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోనున్నారట మహేశ్ బాబు. ఇందుకోసం మూడు నెలల పాటు బ్యాంకాక్ వెళతారని టాక్. అక్కడ మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ ట్రైనింగ్, హైకింగ్, ట్రెక్కింగ్ వంటివి నేర్చుకోనున్నారట. ఈ శిక్షణ ఇవ్వనున్న బ్యాంకాక్ స్టంట్ టీమ్‌కి ఓ హాలీవుడ్ ప్రముఖ స్టంట్ కొరియోగ్రాఫర్ నేతృత్వం వహిస్తారని తెలిసింది. ప్రస్తుతం త్రివిక్రమ్ దర్శకత్వం వహిస్తున్న 'గుంటూరు కారం'లో నటిస్తున్నారు మహేశ్‌బాబు. ఈ చిత్రం పూర్తయ్యాక బ్యాంకాక్‌లో శిక్షణ తీసుకుని, రాజమౌళి సినిమా షూట్‌లో జాయిన్ అవుతారట. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్నారు రాజమౌళి. ఈ చిత్రానికి రాజమౌళి తండ్రి విజయేంద్ర ప్రసాద్ కథ అందిస్తున్న సంగతి తెలిసిందే.


● కాజల్

థాయ్‌ల్యాండ్‌లో...
తొలి చిత్రం 'ఉప్పెన'తో (2021) బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నారు వైష్ణవ్ తేజ్. ఆ తర్వాత 'కొండపొలం, రంగ రంగ వైభవంగా' వంటి చిత్రాల్లో నటించారు. ఈ మూడు చిత్రాల్లో సాఫ్ట్ క్యారెక్టర్‌తో ప్రేక్షకులను అలరించిన ఆయన తొలిసారి 'ఆదికేశవ' చిత్రంలో ఫుల్ యాక్షన్ రోల్ చేశారు. శ్రీకాంత్ ఎన్. రెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో హై ఓల్టేజ్ యాక్షన్ సన్నివేశాల కోసం థాయ్‌ల్యాండ్‌లో మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకున్నారు వైష్ణవ్ తేజ్. ఈ చిత్రంలో వైష్ణవ్‌కు జోడీగా శ్రీలీల నటించారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా ఆగస్టు 18న రిలీజ్ కానుంది.

కలరి మార్షల్ ఆర్ట్‌లో...
మలయాళ హీరో టొవినో థామస్ కలరి అనే మార్షల్ ఆర్ట్‌లో శిక్షణ పొందారు. టొవినో థామస్ హీరోగా నటిస్తున్న చిత్రం 'అజయంతే రందం మోషణం'. జితిన్ లాల్ దర్శకత్వం వహిస్తున్నారు. కథ పరంగా కేరళలోని కలరి అనే మార్షల్ ఆర్ట్‌కు ఈ చిత్రంలో ప్రాధాన్యం ఉండటంతో టొవినో థామస్ ఈ విద్యలో శిక్షణ తీసుకుని నటిస్తున్నారు. ఈ చిత్రంలో కృతీ శెట్టి, ఐశ్వర్య రాజేష్, సురభి లక్ష్మి హీరోయిన్లుగా నటిస్తున్నారు.

భారతీయుడు కోసం...
కమల్‌హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వం వహిస్తున్న 'భారతీయుడు 2' కోసం కాజల్ అగర్వాల్ మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకున్నారు. 'భారతీయుడు' (1996) సినిమాకి సీక్వెల్‌గా 'భారతీయుడు 2' (తమిళంలో 'ఇండియన్ 2) రూపొందుతోంది. ఈ చిత్రంలో కమల్‌కు జోడీగా కాజల్ నటిస్తున్నారు. ఈ చిత్రంలో పవర్‌ఫుల్ ఫైట్స్ చేయడం కోసం అతిపురాతనమైన యుద్ధ క్రీడ కలరి పయట్టు నేర్చుకున్నారు కాజల్. కలరి సాధన చేస్తున్న ఓ వీడియోను ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ చేసి, 'షావోలిన్, కుంగ్ ఫూ, కరాటే, తైక్వాండో.. వంటి క్రీడలు కలరి నుంచి పుట్టుకొచ్చినవే' అని పేర్కొన్నారామె. ఈ మూవీ కోసం గుర్రపు స్వారీ కూడా నేర్చుకున్నారు కాజల్ అగర్వాల్.

కోలీవుడ్‌లో ఫెఫ్సీ కొత్త నిబంధనలు

● సినిమా షూటింగ్‌లకు ఫెఫ్సీ కొత్త నియమాలు ● వెల్లువెత్తుతున్న విమర్శలు

దక్షిణ భారత సినీ కార్మికుల సంఘం (ఫెఫ్సీ) కొత్త నియమ, నిబంధనలు కోలీవుడ్‌లో చర్చనీయాంశమయ్యాయి. తమిళ చిత్రాలకు స్థానిక నటీనటులు, సాంకేతిక నిపుణులు మాత్రమే పని చేయాలని, తమిళ సినిమాల చిత్రీకరణలు తమిళనాడులోనే జరగాలని, సరైన కారణాలు లేనిదే అవుట్‌డోర్ లొకేషన్స్‌లో షూటింగ్ జరపకూడదని ఫెఫ్సీ కొత్త నియమాలు చేసిందని సమాచారం. అలాగే అనుకున్న సమయంలోపు సినిమా చిత్రీకరణ పూర్తి కాకపోయినా, బడ్జెట్ పరిమితి దాటినా నిర్మాతలకు సరైన కారణాలతో లిఖిత పూర్వకమైన లేఖను సమర్పించాలని, ఒకవేళ ఓ సినిమాకు దర్శకుడే రచయిత అయితే, ఆ సినిమా కథకు సంబంధించి ఏదైనా సమస్య ఉంటే అతనే పరిష్కరించుకోవాలని, ఆ సమస్య ప్రభావం షూటింగ్, నిర్మాతలపై పడకుండా జాగ్రత్త వహించే బాధ్యత కూడా ఆ వ్యక్తే తీసుకోవాలన్నట్లుగా కొన్ని నియమాలను 'ఫెఫ్సీ' తీసుకొచ్చిందట. ఈ కొత్త నిర్ణయాలపై కోలీవుడ్‌లోనే కాదు.. సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 'ఈ నిబంధనలు ఉన్నప్పుడు తమిళ సినిమాలను తమిళనాడులోనే రిలీజ్ చేసుకోవాలి. కోలీవుడ్‌లో హీరోయిన్లకు కొరత ఏర్పడుతుంది. సినిమాకి వాడే సాంకేతిక సామాగ్రిని కూడా తమిళనాడులోనే తయారుచేసుకోవాలి' అంటూ ఫెఫ్సీ నియమాలపై సోషల్ మీడియాలో కొందరు నెటిజన్లు వ్యంగ్యాస్త్రాలు విసురుతున్నారు. అయితే ఈ కొత్త నియమాలను కొందరు తప్పుగా అర్థం చేసుకున్నారని ఫెఫ్సీ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి పేర్కొన్నారట.